

సీఎం చంద్రబాబు అనుభవజ్ఞమైన సారథ్యం, మంత్రి లోకేష్ నాయకత్వ ప్రతిభపై నమ్మకంతో దేశవిదేశీ పారిశ్రామికవేత్తలు విశాఖ సదస్సుకు తరలివచ్చారు. లక్షల కోట్ల పెట్టుబడులకు ముందుకు రావడం కూటమి ప్రభుత్వ పాలనపై పారిశ్రామికవర్గాల విశ్వాసానికి నిదర్శనం.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శనివారం 14.11.2026

INK OF TRUTH


జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 203 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00

పెట్టుబడుల రక్షణకు ప్రత్యేక చట్టం!

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు శ్రీకారం | **13 లైసెన్సులతో ఐదు రోజుల్లో అనుమతులు** | **రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు** | **522 ప్రాజెక్టుల గ్రౌండింగ్‌పై దృష్టి**



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడిదారులకు భరోసా కల్పించడంతో పాటు పరిశ్రమల స్థాపనను వేగవంతం చేసేందుకు విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. పెట్టుబడుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురానున్నామని, పరిశ్రమలకు కేవలం 13 లైసెన్సులతో ఐదు రోజుల్లోనే అనుమతులు మంజూరు చేసే విధానాన్ని అమల్లోకి తెచ్చామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం, ప్రాజెక్టులను నిర్దేశిత సమయంలో కార్యరూపంలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

విశాఖపట్నంలో శుక్రవారం జరిగిన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు కార్యక్రమంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. రెండు రోజుల పాటు 'నేవిగేటింగ్ ది న్యూ వరల్డ్ ఆర్డర్' ఇతివృత్తంతో ట్రేడ్, టెక్నాలజీ, ట్రస్ట్, థాట్ లీడర్‌షిప్ అంశాలపై జరిగిన సదస్సులో వివిధ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, కేంద్ర మంత్రులు పాల్గొన్నారని తెలిపారు. దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా గుర్తింపు పొందిన విశాఖపట్నంలో అంతర్జాతీయ స్థాయి సదస్సు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులు : సీఐఐ భాగస్వామ్య సదస్సుతో పాటు ఆరు సన్నాహక సమావేశాల ద్వారా రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించామని చంద్రబాబు తెలిపారు. ఈ సదస్సులో 303 పెట్టుబడి ప్రతిపాదనల ద్వారా రూ. 9.89 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు. తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, విద్య, వైద్యం, ఏవియేషన్, ఆటోమొబైల్ సహా వివిధ రంగాల్లో పెట్టుబడులు వస్తున్నాయని చెప్పారు. కియా సంస్థ ఏడాదికి మరో రెండు లక్షల కార్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు రూ. 18,800 కోట్ల

మిగతా 2లో...

ఒప్పందాలకే కాదు.. అమలుకూ ఆడిట్

రూ.32.49 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు

526 ప్రాజెక్టులకు ఆమోదం.. 303 నిర్మాణ దశకు

ఎంఓయూల అమలుపై ఏటా ఆడిట్ నివేదిక

2 లో

ఐటీ నాడు.. ఏఐ నేడు



క్వాంటం, పర్యాటక రంగాలపై ప్రత్యేక దృష్టి

యువతకు ఉపాధి అవకాశాలే లక్ష్యం

పేదరిక నిర్మూలనకు పీ4 కార్యక్రమం

సంపదలో అన్ని వర్గాలకూ భాగస్వామ్యం ఉండాలి

2 లో

కొలువుల కల సాకారం



రాష్ట్రానికి రూ.1.41 లక్షల కోట్ల పెట్టుబడులు

ఒక్కరోజే 12 కీలక అవగాహన ఒప్పందాలు

10,919 మందికి ఉపాధి అవకాశాలు

పారిశ్రామిక, సాంకేతిక రంగాలకు కొత్త ఊపు

2 లో

స్పేస్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్

అంతరిక్ష పరిశ్రమలకు ప్రోత్సాహం | **స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈలకు పెద్దపీట** | **పరిశ్రమలు, విద్యాసంస్థల అనుసంధానం** | **స్పేస్ ఎకానమీపై లోకేష్ దిశానిర్దేశం**



ఏపీకి డిక్సన్ మరో వరం

- మంత్రి లోకేశ్‌తో డిక్సన్ ప్రెసిడెంట్ పంకజ్ శర్మ భేటీ
- ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ తయారీ యూనిట్‌కు ఆహ్వానం
- ఏపీలో కొత్తగా రూ.700 కోట్ల పెట్టుబడులకు డిక్సన్ సుముఖత

3 లో

విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్) : అంతరిక్ష రంగంలో నూతన గమ్యస్థానంగా ఏపీని తీర్చిదిద్దుతామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సీఐఐ సదస్సుల్లో భాగంగా రెండో రోజు 'కక్ష్య నుంచి అవకాశాల దిశగా: భారతదేశ నూతన అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ' అనే అంశంపై జరిగిన ప్రత్యేక చర్చలో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మోడరేటర్ గా బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్ సీఈవో, సీటీవో రోహన్ గణపతి వ్యవహరించారు. ఈ సందర్భంగా అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానంగా నియంత్రించే అంతరిక్ష రంగంలో రాష్ట్రప్రభుత్వపాత్ర ఏమిటి అని అడిగారు. ఆంధ్రప్రదేశ్‌లో వివిధ పారిశ్రామిక ఎకోసిస్టమ్‌లను ఎలా అభివృద్ధి చేస్తున్నామో పరిశీలిస్తే, ముందుగా

3 లో..

లోకేష్ సమక్షంలో పెట్టుబడుల వరద



రూ.1,05,634 కోట్ల విలువైన 24 ఒప్పందాలు

యువతకు 75,055 ఉద్యోగావకాశాలు

3 లో..

మారిటైమ్ రోబోటిక్స్‌కు ఏపీ కేంద్రం కావాలి

స్కిల్లింగ్ సెంటర్ ఏర్పాటుకు సాగర్ డిఫెన్స్‌కు లోకేశ్ ఆహ్వానం

నెల్లూరులో రోబోటిక్స్ అనుబంధ పరిశ్రమలకు ప్రోత్సాహం

3 లో..

రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు..

ఏపీ ప్రగతికి నిదర్శనం

- **దేశాభివృద్ధిలో ప్రభుత్వం, పరిశ్రమలు, విద్యాసంస్థలు భాగస్వాములు కావాలి**
- **ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్**



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్ర విభజనతో ఎదురైన అనేక సవాళ్లను అధిగమిస్తూ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్ పేర్కొన్నారు. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రం రూ. 22 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం సాధారణ విషయం కాదని అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా స్వర్ణాంధ్ర సాధన దిశగా రాష్ట్రం అడుగులు వేస్తోందని తెలిపారు.

విశాఖపట్నంలో నిర్వహించిన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆయన ప్రసంగించారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలతో పాటు భవిష్యత్తు పారిశ్రామికాభివృద్ధిపై విస్తృత మేధోమథనం జరిగిందన్నారు. వచ్చే ఏడాది నిర్వహించనున్న సదస్సుకు కూడా పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పుడే ఆహ్వానించడం ఆయన ఆత్మవిశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు.

రాష్ట్ర విభజన అనంతరం శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు విస్తరిస్తున్నాయని చెప్పారు. పోర్టులు, విమానాశ్రయాలు, ఎలక్ట్రానిక్స్, అంతరిక్షం, రక్షణ, పర్యాటకం వంటి కీలక రంగాల్లో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడులను ఆకర్షిస్తోందని వివరించారు. ప్రతి సంక్షోభం కొత్త అవకాశాలను కూడా తీసుకొస్తుందని, ప్రస్తుత పరిస్థితుల్లో భారత్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ కూడా ఆ అవకాశాలను అందిపుచ్చుకుంటున్నాయని అన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా

మిగతా 3లో...

పోర్టులే ప్రగతికి చోదకశక్తులు



- **ఓడరేవులను అనుసంధానిస్తూ జాతీయ రహదారులు**
- **అమరావతి చుట్టూ 192 కి.మీ. రింగ్‌రోడ్డు**
- **రాయపూర్-విశాఖ కారిడార్ 96 శాతం పూర్తి**
- **కేంద్ర కేబినెట్ ఆమోదం దిశగా ఓఆర్ఆర్**

విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో పోర్టులు కీలక పాత్ర పోషించనున్నాయని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. సుదీర్ఘ సముద్ర తీరప్రాంతం, అనేక ఓడరేవులు ఉండటం రాష్ట్రానికి గొప్ప అవకాశమని,

మిగతా 3లో...

పెట్టుబడులకు ఏపీ భరోసా



- **రాష్ట్రంపై పెట్టుబడిదారులకు పూర్తి విశ్వాసం**
- **రెండున్నరేళ్లలో భారీగా పెట్టుబడుల రాక**
- **యువతకు విస్తృతంగా ఉపాధి అవకాశాలు**
- **గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్**

విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అన్నారు. రాష్ట్రప్రభుత్వంపై పారిశ్రామికవేత్తలు పూర్తి విశ్వాసం ఉంచారని, గత రెండున్నరేళ్లలో రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు రావడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ పెట్టుబడుల ద్వారా యువతకు విస్తృతమైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో నిర్వహించిన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో గవర్నర్ ప్రసంగించారు.

మిగతా 3లో...

విద్యుత్ సంస్కరణల్లో ఏపీ విప్లవాత్మక మార్పులు



- **సీఎం చంద్రబాబు సమర్థ నాయకత్వం..**
- **పెట్టుబడులకు అనుకూల వాతావరణం**
- **కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి**

విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యుత్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రశంసించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఏర్పడిందని, శాంతిభద్రతల పరిస్థితులు మెరుగుపడటంతో భారీ పెట్టుబడులు వస్తున్నాయని పేర్కొన్నారు.

విశాఖపట్నంలో జరిగిన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో యువతకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయమని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ 'వన్ ఫ్యామిలీ.. వన్ ఏఐ ఛాంపియన్' విధానాన్నికూడా అమల్లోకి తీసుకురావాలని రాష్ట్రం భావిస్తోందని తెలిపారు.

పునరుత్పాదక విద్యుత్ రంగంలో భారత్ 500 గిగావాట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగుతోందని చెప్పారు. అన్ని రాష్ట్రాలు టీమ్ ఇండియా స్ఫూర్తితో కలిసికట్టుగా పనిచేస్తే నిర్దేశిత ఆర్థిక వృద్ధి లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోని అనేక దేశాలు సంక్షోభాలను ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో భారత్, ఆంధ్రప్రదేశ్ వంటి ప్రాంతాలు అభివృద్ధిలో ముందంజలో ఉన్నాయని పేర్కొన్నారు.

గతంలో నక్సల్స్ సమస్య కారణంగా దేశంలోని పలు ప్రాంతాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగేదని, ఆంధ్రప్రదేశ్ కూడా ఈ సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొందని గుర్తుచేశారు. ప్రస్తుతం నక్సల్స్ సమస్యతగ్గి శాంతిభద్రతలు మెరుగుపడటంతో పెట్టుబడులకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు.

సీఐఐ భాగస్వామ్య సదస్సుల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు సుమారు రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు, వాటిలో గణనీయమైన

మిగతా 3లో...

ఏపీ ప్రగతికి 'టైమ్' ప్రశంస


- **రాష్ట్ర అభివృద్ధి నమూనాను ప్రపంచానికి చాటుతాం**
- **అద్భుత నాయకత్వం.. అసాధారణ ప్రగతి**
- **ఆరు నెలల్లోనే గూగుల్ ఏఐ హబ్‌కు శంకుస్థాపన**
- **'టైమ్' ఇంటర్నేషనల్ ఎండీ డామియన్ డగ్లస్**



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రస్థానం, పెట్టుబడుల ఆకర్షణలో రాష్ట్రం సాధిస్తోన్న పురోగతిని అంతర్జాతీయ వేదికపై చాటిచెప్పేలా విశాఖపట్నంలో 'టైమ్ ఇంపాక్ట్ డిన్నర్' కార్యక్రమం నిర్వహించారు. సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ సందర్భంగా గురువారం రాత్రి ది పార్క్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'టైమ్' ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ డామియన్ డగ్లస్‌తో ప్రత్యేక ముఖాముఖిలో పాల్గొన్నారు. సుమారు 100 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వ్యాపార, ప్రభుత్వ రంగ ప్రతినిధులు దీనికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడులకు సానుకూల వాతావరణం, వేగవంతంగా ప్రాజెక్టుల అమలు తదితర అంశాలపై సీఎం చంద్రబాబు తన అభిప్రాయాలను పంచుకున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని కల్పించడమే కాకుండా, పరిశ్రమల స్థాపన, ప్రాజెక్టులు వేగంగా గ్రౌండింగ్ అవ్వడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నుంచి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' దిశగా ఆంధ్రప్రదేశ్ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. గూగుల్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌లో ఏఐ హబ్ ఏర్పాటుకు 2025 అక్టోబర్‌లో ప్రకటించగా,

మిగతా 3లో...

ఐటీ నాడు.. ఏఐ నేడు



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :భవిష్యత్తులో ఏ రంగాలకు ప్రాధాన్యత పెరుగుతుందో ముందుగానే అంచనా వేసి, అందుకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవడమే నాయకత్వ లక్షణమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఐటీ రంగానికి ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్ర అభివృద్ధికి పునాదులు వేశానని గుర్తుచేశారు. ప్రస్తుతం ఏఐ, క్వాంటం టెక్నాలజీ, పర్యాటకం వంటి భవిష్యత్ రంగాలపై దృష్టి సారిస్తున్నామని తెలిపారు.

విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజు సీనియర్ జర్నలిస్ట్ పాల్కీ శర్మ నిర్వహించిన ఫైర్‌సైడ్ చాట్‌లో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన రాజకీయ, పాలనా అనుభవాలను పంచుకుంటూ రాష్ట్ర, దేశ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై మాట్లాడారు.

ఐటీ భవిష్యత్తును ఆనాడే గుర్తించాలి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఐటీ రంగానికి భవిష్యత్తులో విస్తృత అవకాశాలు ఉంటాయని ముందుగానే గుర్తించి సంస్కరణలు చేపట్టానని చంద్రబాబు తెలిపారు. హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ కార్యకలాపాలు ప్రారంభించేలా సంస్థ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌ను ఒప్పించిన సందర్భాన్ని వివరించారు. భారతీయ విద్యార్థులకు గణితం, ఇంగ్లీష్‌లో మంచి ప్రావీణ్యం ఉందని, ఈ నైపుణ్యాలు ఐటీ రంగానికి ఎంతో ఉపయోగపడతాయని ఆయనకు వివరించినట్లు చెప్పారు. ఐటీ పరిశ్రమకు అవసరమైన మానవ వనరులను అందుబాటులోకి తెచ్చేందుకు ఇంజినీరింగ్ కళాశాలలకు పెద్దఎత్తున అనుమతులు ఇచ్చామన్నారు. ఆ సమయంలో ఐటీ రంగానికి తాను ఇస్తున్న ప్రాధాన్యతపై ప్రతిపక్షాలు విమర్శలు చేసినప్పటికీ వెనక్కి తగ్గలేదని పేర్కొన్నారు. ఐటీ సంస్కరణలతో పాటు దేశంలోనే తొలిసారిగా విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు.

యువతే భారతదేశానికి అతిపెద్ద సంపద : ప్రపంచంలోని అనేక దేశాల్లో యువ జనాభా తగ్గిపోతున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయని, భారతదేశానికి యువత అతిపెద్ద మానవ వనరులని చంద్రబాబు అన్నారు. జనాభాను భారంగా కాకుండా సంపదగా మలుచుకోవాలని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ఏఐ, క్వాంటం కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక రంగాలతో పాటు పర్యాటకం, సేవల రంగాల్లోనూ పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అందుబాటులోకి వస్తున్న సాంకేతికతను యువత అందిపుచ్చుకోవాలని, భవిష్యత్ అవసరాలను అంచనా వేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

సాంకేతిక, ఆర్థిక అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరాలని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. గతంలో పీ3 విధానంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని, దాని ద్వారా కొందరు అపారమైన ప్రగతి సాధించారని చెప్పారు. అయితే పేదలు, ధనవంతుల మధ్య అంతరాలను తగ్గించేందుకు పీ4 కార్యక్రమాన్ని ప్రారంభించామని వివరించారు. ప్రతి కార్పొరేట్ సంస్థ పేద కుటుంబాలకు అండగా నిలవాలనే ఆలోచనతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

సంపద కొందరి వద్దే కేంద్రీకృతమైతే పేద, మధ్యతరగతి వర్గాల్లో అసంతృప్తి పెరుగుతుందని, అది సామాజిక సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే కొన్ని దేశాల్లో ఇటువంటి పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. సంపన్నులు, కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతతో పేదల అభ్యున్నతికి సహకరించాలని కోరారు.

డేటా సెంటర్ల ఏర్పాటుతో పర్యావరణంపై ప్రభావం, నీటి వినియోగం పెరుగుతుందన్న ఆందోళనలను పాల్కీ శర్మ ప్రస్తావించగా, చంద్రబాబు స్పందించారు. డేటా సెంటర్లకు అవసరమైన నీటి విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గోదావరి నుంచి ప్రతి ఏడాది సుమారు మూడు వేల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోందని, పోలవరం ఎడమ కాలువ ద్వారా విశాఖకు వంద టీఎంసీల నీటిని తీసుకువచ్చే అవకాశం ఉందని వివరించారు. డేటా సెంటర్లకు సుమారు 3.5 టీఎంసీల నీరు అవసరమవుతుందని, గోదావరి జలాలను తాగునీరు, సాగునీరు, పారిశ్రామిక అవసరాలకు కూడా వినియోగించుకోవచ్చని తెలిపారు. డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్‌ను గ్రీన్ ఎనర్జీ ద్వారా అందించే ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు.

జనాభా నియంత్రణపై గతంలో తాను చేసిన సూచనలకు భిన్నంగా ఇప్పుడు ఎక్కువ మంది పిల్లలను కనాలని ఎందుకు చెబుతున్నారనే ప్రశ్నకు చంద్రబాబు సమాధానమిచ్చారు. గతంలో ఒకరు లేదా ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండాలని సూచించానని, అయితే ప్రపంచ దేశాల్లో మారుతున్న జనాభా పరిస్థితులను పరిశీలించిన తర్వాత తన ఆలోచనల్లో మార్పు వచ్చిందని తెలిపారు. ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉండాలనే విధానాన్ని అమలు చేయడం అంత సులభం కాదని అంగీకరించారు. అయినప్పటికీ దీర్ఘకాలంలో సమాజానికి మేలు జరుగుతుందని భావిస్తే ఆ విషయాన్ని ప్రజలకు చెబుతూనే ఉంటానన్నారు.

రాజకీయ సిద్ధాంతాల కంటే ప్రస్తుతం ప్రజల సంక్షేమం, దేశాభివృద్ధికే ప్రాధాన్యత పెరిగిందని చంద్రబాబు అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి ప్రధాని నరేంద్ర మోదీ సరైన నాయకత్వాన్ని అందిస్తున్నారని అభిప్రాయపడ్డారు. భారతదేశ అభివృద్ధికి రాబోయే 20 ఏళ్లు అత్యంత కీలకమని, ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ కోల్పోకూడదని పేర్కొన్నారు.


ప్రజలు, ముఖ్యంగా యువత ఆలోచనా విధానాల్లో వస్తున్న మార్పులను నాయకులు నిరంతరం గమనించాలని చంద్రబాబు సూచించారు. వివిధ వర్గాలతో నిరంతరం మమేకమై వారి అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటే ఆందోళనలకు అవకాశం తగ్గుతుందని అన్నారు. ప్రజలకు సేవలు అందించే విషయంలో వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటున్నామని తెలిపారు.

గతంలో అధికారంలో ఉన్నప్పుడు పాలనపై ఎక్కువగా దృష్టి పెట్టి రాజకీయ అంశాలను నిర్లక్ష్యం చేసిన సందర్భాలు ఉన్నాయని, రాజకీయాలు, పరిపాలన మధ్య సమతుల్యత లోపించడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నామని అంగీకరించారు. ఈసారి ఆ రెండింటి మధ్య సమన్వయంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. జనసేన, బీజేపీతో కలిసి కూటమి ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తోందని పేర్కొన్నారు.

అంతర్జాతీయ పరిణామాలు, యుద్ధాలు, తుపాన్లు, ఎల్‌నినో వంటి ప్రకృతి సంబంధిత పరిస్థితుల ప్రభావం ప్రజలపై పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు తెలిపారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, మహిళలను వేధించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

ఎన్నికల ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై వచ్చిన విమర్శలను కూడా ఆయన ప్రస్తావించారు. ప్రతి 20 నుంచి 25 ఏళ్లకోసారి ఓటర్ల జాబితాను సమగ్రంగా సవరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో ఓట్లు తొలగించారంటూ వచ్చిన ఆరోపణలను అపోహలుగా అభివర్ణించారు. రాజకీయ పార్టీలు గ్రామస్థాయిలో తమ నెట్‌వర్క్‌ను సమర్థంగా వినియోగించుకుంటే అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండేలా చూసుకోవచ్చన్నారు.

వివిధ రంగాల్లో అభివృద్ధి, ప్రజల సంక్షేమం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సామాజిక అసమానతల తగ్గింపే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చంద్రబాబు వివరించారు.



పెట్టుబడుల రక్షణకు ప్రత్యేక చట్టం!

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడులకు ముందుకొచ్చిందని, రిలయన్స్ సంస్థ రూ. 2.43 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలతో ఒప్పందం చేసుకుందని వివరించారు.

2024 నుంచి ఇప్పటివరకు వచ్చిన 714 పెట్టుబడి ప్రతిపాదనల్లో 522 ప్రాజెక్టులు కార్యరూపం దాల్చే దిశగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. చేనేత క్లస్టర్ల నుంచి ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్ వరకు అన్ని రంగాలకు పెట్టుబడులను విస్తరించడమే లక్ష్యమన్నారు.

ఐదు రోజుల్లో పరిశ్రమలకు అనుమతులు : పరిశ్రమల స్థాపనకు అడ్డంకిగా ఉన్న నిబంధనలను తొలగిస్తూ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. నాలా చట్టాన్ని రద్దు చేశామని, ఆటోమేటిక్ అప్రూవల్స్, సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానాలను ప్రవేశపెట్టామని చెప్పారు. నిర్దేశిత గడువులోగా అనుమతులు మంజూరు చేసే వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు.

పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపులకు ఎస్క్రో ఖాతా విధానాన్ని ప్రారంభించామని, ఇది పారిశ్రామిక సంస్కరణల్లో కొత్త ఒరవడికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు. పెట్టుబడిదారులకు ప్రభుత్వాల మార్పుతో సంబంధం లేకుండా రక్షణ కల్పించేందుకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురానున్నట్లు పునరుద్ఘాటించారు.

ఐటీ విప్లవం నుంచి ఏఐ విప్లవం వరకు : గతంలో ఐటీ విప్లవాన్ని అందిపుచ్చుకుని తెలుగువారిని ప్రపంచ స్థాయి నిపుణులుగా తీర్చిదిద్దామని చంద్రబాబు గుర్తుచేశారు. ఇప్పుడు 'వన్ ఫ్యామిలీ.. వన్ ఏఐ' విధానం ద్వారా ప్రతి కుటుంబంలో కృత్రిమ మేధపై అవగాహన, నైపుణ్యాలను పెంపొందిస్తామని చెప్పారు. పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రతి ఇంటిపై సౌర ఫలకాలను ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తిని పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

దేశవ్యాప్తంగా 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం ఉండగా, ఆంధ్రప్రదేశ్ ఒక్కటే 160 గిగావాట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే ఈ లక్ష్యాన్ని కూడా అధిగమించే సామర్థ్యం రాష్ట్రానికి ఉందన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలను తయారుచేసేందుకు డ్వాక్రా మహిళలను ప్రోత్సహిస్తున్నామని వివరించారు.

11 లక్షల కుటుంబాలకు పీ4 చేయూత : ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రజలకు సామాజిక, ఆర్థిక భద్రత కల్పించడంలో ఆంధ్రప్రదేశ్ ముందుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఓపీ జిందాల్ యూనివర్సిటీ విడుదల చేసిన యాక్సెస్ టు ఈక్వాలిటీ ఇండెక్స్‌లో రాష్ట్రం రెండో స్థానంలో నిలిచిందని తెలిపారు. ప్రతి పౌరుడికి గౌరవప్రదమైన జీవన ప్రమాణాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

పేద కుటుంబాల జీవన ప్రమాణాలను పెంచేందుకు పీ4 కార్యక్రమాన్ని చేపట్టామని, ఇప్పటికే లక్ష మంది మార్గదర్శులు 11 లక్షల కుటుంబాలను దత్తత తీసుకుని వారికి అండగా నిలుస్తున్నారని వెల్లడించారు. కేవలం ఆర్థిక సహాయం అందించడం మాత్రమే కాకుండా, వారికి సాధికారత కల్పించి స్వయంగా ఎదిగేలా చేయూతనివ్వడం ముఖ్యమని చెప్పారు. సమాజంలోని ఉన్నత వర్గాలు పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారి అభ్యున్నతిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

గోదావరి-కావేరి అనుసంధానంతో జలవివాదాలకు పరిష్కారం : భవిష్యత్తులో నీటి భద్రత అత్యంత కీలకమైన అంశంగా మారనుందని చంద్రబాబు అన్నారు. గోదావరి–కావేరి నదుల అనుసంధానం దక్షిణ భారత రాష్ట్రాల నీటి సమస్యలకు పరిష్కారం చూపగలదని అభిప్రాయపడ్డారు. నీటి పంపకాల విషయంలో రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాలను పరస్పర సహకారంతో పరిష్కరించుకోవాలని సూచించారు. తమిళనాడు–కర్ణాటక, తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ మధ్య జలవివాదాలు సామరస్యపూర్వకంగా పరిష్కారం కావాలని ఆకాంక్షించారు.

ముందుగా మనమంతా భారతీయులమని, ఆ తర్వాతే



రాష్ట్రాలు, ప్రాంతాలని పేర్కొన్నారు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రాల మధ్య నీటి పంపకాలు జరగాలని పిలుపునిచ్చారు.

కేంద్ర సహకారంతో కీలక ప్రాజెక్టులు : కేంద్ర ప్రభుత్వ సహకారంతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాజెక్టును పూర్తి చేశామని, విశాఖ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ, దక్షిణ కోస్తా రైల్వే జోన్ వంటి ప్రాజెక్టులు ముందుకు సాగుతున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికి పెట్టుబడులు తీసుకురావడం, ప్రాజెక్టులను వేగంగా గ్రౌండింగ్ చేయడమే తమ సంకల్పమన్నారు.

సంక్షోభ సమయాల్లో సమర్థవంతమైన నాయకత్వం అవసరమని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిరంతరం పనిచేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరైన దేశవిదేశీ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. విశాఖతో పాటు అరకు వంటి పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని ఆహ్వానించారు.

కొలువుల కల సాకారం

విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) :ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధికి మరో భారీ పెట్టుబడుల వెల్లువ వచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజు వివిధ రంగాలకు సంబంధించి 12 ఒప్పందాలు కుదిరాయని, వీటి ద్వారా రూ. 1,41,585 కోట్ల పెట్టుబడులు, 10,919 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని వెల్లడించారు. పెట్టుబడుల ఒప్పందాలు చేసుకోవడంతోనే సరిపెట్టకుండా ప్రాజెక్టులను వేగంగా కార్యరూపంలోకి తీసుకురావాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.

డేటా సెంటర్లకు రూ.1.03 లక్షల కోట్లు : సదస్సులో కుదిరిన ఒప్పందాల్లో అత్యధికంగా ఎయిర్‌ట్రంక్ ఇండియా–జేసీకే ఇన్‌ఫ్రా సంస్థలు భారీ పెట్టుబడులకు ముందుకొచ్చాయి. ఐటీ విభాగంతో కుదిరిన ఒప్పందం ప్రకారం 1,400 మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ క్యాంపస్, టెలికాం సెంటర్ల ఏర్పాటుకు రూ. 1,03,018 కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా 3,120 మందికి ఉపాధి లభించనుంది.

ప్రకాశం జిల్లా కందుకూరులో మైనింగ్ కార్యకలాపాల కోసం హిందాల్కో గ్రూప్ రూ. 15 వేల కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీనివల్ల 2,500 మందికి ఉద్యోగాలు కల్పించనున్నారు. పునరుత్పాదక ఇంధన రంగంలో గ్రీన్‌జెన్ రెన్యూవబుల్ ఎనర్జీ రూ. 8 వేల కోట్లు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ రూ. 6,600 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నాయి. వీటి ద్వారా వరుసగా 200, 800 మందికి ఉపాధి లభించనుంది.

కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్ రూ. 6,452 కోట్ల పెట్టుబడితో మెకనైజ్డ్ బెర్త్, రీగ్యాసిఫికేషన్ యూనిట్, షిప్ బిల్డింగ్ అండ్ రిపేర్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా 852 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.

అంతరిక్ష, రక్షణ రంగాలకు ప్రోత్సాహం : తిరుపతి జిల్లాలో ఆర్బిటల్ డేటా సెంటర్, రాకెట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అగ్నికుల్ కాస్మోస్ లిమిటెడ్ రూ. 510 కోట్ల పెట్టుబడితో ఒప్పందం చేసుకుంది. ఈ సంస్థ 350 మందికి ఉద్యోగాలు కల్పించనుంది. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో హాథోర్ రాకెట్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 250 కోట్ల పెట్టుబడితో 200 మందికి ఉపాధి కల్పించనుంది.

ఎలక్ట్రానిక్స్ రంగంలో డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా రూ. 700 కోట్ల పెట్టుబడితో 2,300 ఉద్యోగాలు కల్పించేందుకు ఒప్పందం చేసుకుంది. పర్యాటక రంగంలో ఒబెరాయ్ హోటల్స్ గ్రూప్‌కు చెందిన ఈఐహెచ్ లిమిటెడ్ అమరావతి ప్రాంతంలో రూ. 175 కోట్ల పెట్టుబడితో 150 మందికి ఉపాధి కల్పించనుంది.

పీ4కు కార్పొరేట్ సంస్థల చేయూత : పెట్టుబడులతో పాటు సామాజిక బాధ్యతలో భాగంగా పీ4 కార్యక్రమానికి రెండు కీలక ఒప్పందాలు కుదిరాయి. రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాల్లోని 1,120 మంది ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు ఆర్థిక సహకారం అందించేందుకు హీరో మోటార్ కార్పొరేషన్‌తో స్వర్ణాంధ్ర ఫౌండేషన్ ఒప్పందం చేసుకుంది. బ్రిజ్ మోహన్ లాల్ ముంజాల్ స్కాలర్‌షిప్ ద్వారా రూ. 32.48 కోట్ల ఆర్థిక సాయం అందించనున్నారు.

అదేవిధంగా రాష్ట్రంలోని 100 గ్రామాల్లో 25 వేల బంగారు కుటుంబాలను దత్తత తీసుకుని వారి జీవనోపాధి, జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఐటీసీ లిమిటెడ్‌తో స్వర్ణాంధ్ర ఫౌండేషన్ మరో ఒప్పందం చేసుకుంది.

సంపద సృష్టితోపాటు పేదరిక నిర్మూలన : ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ పెట్టుబడులు వస్తేనే సంపద సృష్టి సాధ్యమవుతుందని, అదే సమయంలో ఆ సంపద ఫలాలు పేదలకు కూడా అందాలని అన్నారు. విద్య, వైద్యం, ఆర్థిక, సామాజిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు పీ4 కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. పారిశ్రామికవేత్తలంతా ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

హీరో మోటార్స్ సంస్థ 1,120 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించేందుకు ముందుకు రావడం సంతోషకరమన్నారు. 25 వేల బంగారు కుటుంబాలకు అండగా నిలిచేందుకు ఐటీసీ ముందుకు రావడాన్ని అభినందించారు.

పేద కుటుంబాల అభ్యున్నతికి కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యతతో సహకరించాలని కోరారు.

తిరుపతి సమీపంలో అంతరిక్ష రంగ పరిశ్రమల ఏర్పాటుకు ఐదు వేల ఎకరాలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. స్పేస్, డిఫెన్స్ రంగాలకు ఈ ప్రాంతం అనుకూలంగా



ఉంటుందని పేర్కొన్నారు. సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ, క్వాంటం టెక్నాలజీ, ఏరోస్పేస్ వంటి రంగాల్లో భారీ పెట్టుబడులకు అవకాశాలున్నాయని వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న ఐఐటీలు, ఇతర ప్రముఖ విద్యాసంస్థలు ఆంధ్రప్రదేశ్‌ను పరిశోధనల ప్రయోగశాలగా మార్చుకుని నూతన ఆవిష్కరణలకు ముందుకు రావాలని కోరారు.

ఓపీ జిందాల్ యూనివర్సిటీ విడుదల చేసిన యాక్సెస్ టు ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ దేశంలో రెండో స్థానంలో నిలవడం రాష్ట్రంలో సామాజిక భద్రత, సమాన అవకాశాలకు నిదర్శనమని చంద్రబాబు పేర్కొన్నారు.

కుప్పంలో టీవీఎస్ సంస్థ సహకారంతో ఓ ఇటుక బట్టీ కార్మికురాలు యజమానిగా ఎదిగిన ఉదాహరణను ముఖ్యమంత్రి వివరించారు. ప్రస్తుతం ఆమె మరో 20 మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరిందని చెప్పారు. ఇలాంటి విజయగాథలు రాష్ట్రవ్యాప్తంగా పునరావృతం కావాలని ఆకాంక్షించారు.

అవసరమైన వారికి సంపద అందినప్పుడే దానికి నిజమైన విలువ ఉంటుందని, ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి కుటుంబం సంతోషంగా, ఆరోగ్యంగా, ఆర్థికంగా బలంగా ఉండాలన్నదే తన లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఒప్పందాలకే కాదు.. అమలుకూ ఆడిట్

విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్న పెట్టుబడులను కేవలం ఒప్పందాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలో పరిశ్రమల స్థాపన, ప్రాజెక్టుల నిర్మాణంగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. 2024 జూన్ నుంచి సీఐఐ భాగస్వామ్య సదస్సుకు ముందు వరకు 714 ప్రాజెక్టులకు సంబంధించి రూ. 22.60 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని, వీటి ద్వారా 19.3 లక్షల ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందని వెల్లడించారు. తాజా సదస్సులో వచ్చిన ప్రతిపాదనలతో కలిపి రాష్ట్రానికి మొత్తం రూ. 32.49 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని వివరించారు.

విశాఖపట్నంలో రెండు రోజుల పాటు జరిగిన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. గతంలో అవగాహన ఒప్పందాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యేవని, తమ ప్రభుత్వం ప్రతి ఒప్పందాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రాజెక్టుల పురోగతిని ట్రాక్ చేస్తోందని చెప్పారు.

526 ప్రాజెక్టులకు ఆమోదం.. 303 నిర్మాణ దశకు : 2024 జూన్ నుంచి వచ్చిన 714 పెట్టుబడి ప్రతిపాదనల్లో 526 ప్రాజెక్టులకు భూమి, ప్రోత్సాహకాల పరంగా ఆమోదం తెలిపామని చంద్రబాబు వెల్లడించారు. వీటి పెట్టుబడి విలువ రూ. 17.10 లక్షల కోట్లు కాగా, 12.9 లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉందన్నారు. వీటిలో 303 ప్రాజెక్టులు నిర్మాణం ప్రారంభించిన లేదా నిర్మాణానికి సిద్ధమైన దశకు చేరాయని, వీటి పెట్టుబడి విలువ రూ. 7.30 లక్షల కోట్లు, ఉద్యోగ అవకాశాలు 7.7 లక్షలని వివరించారు.

సదస్సుకు ముందు ఐదు దేశాల్లో, దేశంలోని ఆరు నగరాల్లో కలిపి 11 పెట్టుబడి రోడ్‌షోలు నిర్వహించినట్లు తెలిపారు. విశాఖలో ఏఐ, డేటా సెంటర్లు, కాకినాడలో సముద్ర ఆధారిత పరిశ్రమలు, అమరావతిలో క్వాంటం టెక్నాలజీ, అనంతపురంలో రక్షణ రంగం, తిరుపతిలో ఎలక్ట్రానిక్స్‌పై ప్రాంతీయ సమావేశాలు నిర్వహించామని చెప్పారు.

అక్టోబర్ 7 నుంచి 26 వరకు జరిగిన ప్రాంతీయ సదస్సుల్లో 194 ఒప్పందాలు కుదిరాయని, వీటి ద్వారా రూ. 86,522 కోట్ల పెట్టుబడులు, 1,47,951 ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖలో జరిగిన ప్రధాన సదస్సులో మరో 109 ఒప్పందాలు కుదిరాయని, వీటి పెట్టుబడి విలువ రూ. 9,02,434 కోట్లు కాగా, 2,00,358 ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందన్నారు. ప్రాంతీయ సదస్సులు, ప్రధాన సదస్సు కలిపి 303 కొత్త ఒప్పందాల ద్వారా రూ. 9.89 లక్షల కోట్ల పెట్టుబడులు, 3,48,309 ఉద్యోగ అవకాశాలు వచ్చాయని వివరించారు.

కియా సంస్థ పెనుకొండ ప్లాంటు వార్షిక ఉత్పత్తి సామర్థ్యాన్ని మరో రెండు లక్షల వాహనాల మేర పెంచేందుకు రూ. 18,878 కోట్ల పెట్టుబడులకు ముందుకొచ్చిందని, దీనివల్ల అదనంగా 12 వేల ఉద్యోగాలు కల్పించే అవకాశం ఉందని వెల్లడించారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ : పరిశ్రమల స్థాపనకు అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానానికి మారామని ముఖ్యమంత్రి తెలిపారు. స్వీయ ధ్రువీకరణ ఆధారంగా అనుమతుల ప్రక్రియ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నామని, అనుమతులను రియల్ టైమ్‌లో మంజూరు చేస్తున్నామని చెప్పారు. ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపుల కోసం ఎస్క్రో ఖాతా విధానాన్ని ప్రారంభించామని, ఇది పారిశ్రామిక రంగంలో కొత్త ఒరవడికి నాంది పలుకుతుందని పేర్కొన్నారు. 2024 జూన్ నుంచి వచ్చిన పెట్టుబడులకు రక్షణ కల్పించేలా ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురావాలని నిర్ణయించామని, ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపించి ఆమోదం కోరతామని తెలిపారు.

భూములు తీసుకుని పరిశ్రమలు స్థాపించకుండా నిర్లక్ష్యం చేస్తున్న సంస్థల విషయంలో నిబంధనల ప్రకారం వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. కుదుర్చుకున్న ఎంఓయూలు ఎంతవరకు కార్యరూపం దాల్చాయనే అంశంపై ప్రతి ఏడాది ఆడిట్ నివేదిక విడుదల చేస్తామని ప్రకటించారు.

అమరావతి క్వాంటం కంప్యూటర్ హబ్ : భవిష్యత్తు సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ముందుంటుందని చంద్రబాబు అన్నారు. అమరావతిని క్వాంటం కంప్యూటర్ హబ్‌గా అభివృద్ధి చేయనున్నామని, క్వాంటం కంప్యూటర్లను రాష్ట్రంలోనే తయారుచేసే సామర్థ్యాన్ని పెంపొందిస్తున్నామని తెలిపారు. త్వరలోనే మేడ్ ఇన్ అమరావతి క్వాంటం కంప్యూటర్లు విదేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంతరిక్షం నుంచి విద్యుత్ ఉత్పత్తి, ఉపగ్రహాల్లో డేటా సెంటర్ల ఏర్పాటు వంటి అంశాలపై అధ్యయనాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తున్న కొద్దీ అసాధ్యమనుకున్న లక్ష్యాలు కూడా సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు. సాంకేతికతపై అవగాహన లేకుండా విమర్శలు చేయడం కంటే దానిని నేర్చుకోవడం మంచిదని అభిప్రాయపడ్డారు.

ఎంఎస్ఎంఈలకు ప్రోత్సాహం.. వ్యవసాయానికి ఏఐ : రాష్ట్రంలో 25 సెక్టోరల్ పార్కులు ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను పెద్ద పరిశ్రమలతో అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎంఎస్ఎంఈలకు రతన్



టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా మద్దతు అందిస్తామని, వివిధ రంగాలకు అవసరమైన కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని తెలిపారు. అగ్రి ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు రైతులకు మెరుగైన సలహాలు అందించేందుకు వ్యవసాయ రంగంలో ఏఐ స్టాక్ రూపొందిస్తున్నామని చెప్పారు. ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు ద్వారా వ్యవసాయ పరిశోధనలకు ప్రోత్సాహం కల్పిస్తున్నామని వివరించారు. వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేయడం అంటే మన సంస్కృతిని నిర్లక్ష్యం చేయడమేనని వ్యాఖ్యానించారు.

మొండెలెజ్ సంస్థతో కలిసి కోకో మిషన్ ఏర్పాటు చేస్తున్నామని, అరకు కాఫీ ఉత్పత్తి, అంతర్జాతీయ మార్కెటింగ్‌ను విస్తరించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నామని తెలిపారు. డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు స్వయం బ్రాండ్‌ను తీసుకొచ్చామని చెప్పారు.

రాష్ట్రంలో రోడ్లు, రైలు, విమాన, జల రవాణా అనుసంధానాన్ని మరింత బలోపేతం చేస్తామని చంద్రబాబు తెలిపారు. లాజిస్టిక్స్ రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమివ్వవచ్చన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నదుల అనుసంధానంతో పాటు రూ. 35 వేల కోట్లతో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడం ప్రభుత్వ ప్రాధాన్యతల్లో భాగమని చెప్పారు. ప్రతి జిల్లాలోని ప్రతి ప్రాంతానికి సాగునీరు అందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారుచేసేందుకు స్కిల్ సెన్సస్ నిర్వహిస్తున్నామని తెలిపారు. విశ్వవిద్యాలయాలు, ఐటీఐలు, పాలిటెక్నిక్ సంస్థలను అనుసంధానించి యువతకు పరిశ్రమల అవసరాలకు తగిన శిక్షణ అందిస్తామని చెప్పారు.

ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని ప్రతిబింబించాయని చంద్రబాబు అన్నారు. గత సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే స్థానిక ఎన్నికల్లో కూటమి ఓటు శాతం పెరిగిందని, వైసీపీ ఓటు శాతం తగ్గిందని పేర్కొన్నారు. మంచి రాజకీయాలు, సుపరిపాలన ప్రజలకు మంచి ఫలితాలను అందిస్తాయని వ్యాఖ్యానించారు.

జనాభా ప్రాతిపదికన పదవుల కేటాయింపు, మహిళలకు ప్రాధాన్యత, సూపర్ సిక్స్ పథకాల అమలు ద్వారా ప్రతి కుటుంబానికి భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి ప్రాంతంలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసి ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. యాక్సెస్ టు ఈక్వాలిటీ ఇండెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో నిలవడం సామాజిక, ఆర్థిక భద్రత కల్పనలో రాష్ట్రం సాధించిన పురోగతికి నిదర్శనమని వివరించారు.

సీఐఐ భాగస్వామ్య సదస్సు పెట్టుబడుల ఆకర్షణకే పరిమితం కాకుండా అంతర్జాతీయ పరిణామాలు, సాంకేతికత, వాణిజ్యం, భవిష్యత్తు ఆర్థిక అవకాశాలపై విజ్ఞాన మార్పిడికి కూడా వేదికగా నిలిచిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. విశాఖలో ఐటీ, పర్యాటక రంగాలను అభివృద్ధి చేస్తామని, అరకు వంటి పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకువస్తామని తెలిపారు.

ఏపీకి డిక్సన్ మరో వరం



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : డిక్సన్ టెక్నాలజీస్ ప్రెసిడెంట్ & చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ పంకజ్ శర్మతో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విశాఖపట్నంలో సమావేశమయ్యారు. మంత్రి లోకేష్ తో భేటీ అనంతరం తిరుపతి – EMC-IIలో కొత్తగా రూ. 700 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు పంకజ్ శర్మ సుముఖత వ్యక్తంచేశారు. ఈ పెట్టుబడి ద్వారా రాష్ట్ర యువతకు 2,300 ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. భారతదేశంలోనే అతిపెద్ద ఎల్ఈడీ టీవీ ప్లాంట్ అయిన డిక్సన్ తిరుపతి హబ్... కొప్పర్తి, తిరుపతిలో విస్తరణ ప్రణాళికలను రూపొందించడంపై మంత్రి లోకేష్ ధన్యవాదాలు తెలిపారు. డిక్సన్–ఇన్వెంటెక్ జేవీ కింద ల్యాప్ టాప్, డెస్క్ టాప్, సర్వర్ తయారీ యూనిట్ ఏపీలో ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించారు. డిక్సన్ ప్రెసిడెంట్ పంకజ్ శర్మ మాట్లాడుతూ... డిక్సన్ టెక్నాలజీస్ కు భారతదేశంలోనే అతిపెద్ద రాజుణ టీవీ ప్లాంట్ (షియోమి, ఇతర బ్రాండ్లు) ఇన్–హౌస్ రాజీవీ లైన్ తో 2018 నుంచి తిరుపతిలో ఉందని తెలిపారు. కడప జిల్లా కొప్పర్తిలో ఏఐఎల్ డిక్సన్ (సీపీ ప్లస్)ను రూ. 450కోట్లతో విస్తరిస్తున్నామని, దీని ద్వారా 7వేల ఉద్యోగావకాశాలు లభిస్తాయని చెప్పారు. దీనికి ఇప్పటికే ఎస్ఐపీబీ ఆమోదం లభించిందని తెలిపారు. ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని అన్నారు.

రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు..

ఏపీ ప్రగతికి నిదర్శనం



(మొదటి పేజీ తరువాయి)

దేశం ముందుకు సాగుతోందని తెలిపారు. వివిధ రంగాలు దేశ ఆర్థికాభివృద్ధికి గ్రోత్ ఇంజన్లుగా పనిచేస్తున్నాయని, సమీప భవిష్యత్తులో సాంకేతిక రంగమే కీలక చోదకశక్తిగా మారుతుందని అభిప్రాయపడ్డారు. కృత్రిమ మేధ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను పాలన, పౌరసేవల్లో వినియోగించడం అభినందనీయమన్నారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు.

భారత తయారీ రంగం, దేశీయ పరిశ్రమలు అంతర్జాతీయ పోటీని తట్టుకునే స్థాయికి ఎదగాలని అన్నారు. దేశాన్ని బలమైన ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దేందుకు ఎంఎస్ఎంఈలు, పరిశ్రమలు, పెట్టుబడులకు మరింత ప్రోత్సాహం కల్పించాలని సూచించారు. మానవ వనరుల నైపుణ్యాలను పెంపొందించి భారతీయ మేధోసంపత్తిని ప్రపంచానికి చాటాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వం, పారిశ్రామిక రంగం, విద్యాసంస్థలు, ఆవిష్కర్తలు సమన్వయంతో పనిచేసినప్పుడే దేశ రూపాంతరం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో భారత్ అభివృద్ధి చేసిన టీకాలను ఉచితంగా అందించడం ద్వారా 100 దేశాలకు సహాయం చేయగలిగిందని, అంతర్జాతీయ స్థాయిలో దేశ సామర్థ్యాన్ని చాటిందని గుర్తుచేశారు.

సదస్సులో పాల్గొన్న విదేశీ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, అతిథులకు అభినందనలు తెలిపిన ఉపరాష్ట్రపతి.. కేవలం ఒప్పందాలకే పరిమితం కాకుండా వాటిని వాస్తవ అభివృద్ధి లక్ష్యాలుగా మార్చుకోవాలని సూచించారు. 'కలిసి పనిచేద్దాం.. కలిసి ఎదుగుదాం.. సంపదను సమానంగా పంచుకుందాం' (వర్క్ టుగెదర్, గ్రో టుగెదర్, షేర్ ప్రాస్పెరిటీ) అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

మారిటైమ్ రోబోటిక్స్‌కు ఏపీ కేంద్రం కావాలి



విశాఖపట్నం(జర్నలిస్ట్ ఫైల్) : సాగర్ డిఫెన్స్ ఫౌండర్ కెప్టెన్ నికుంజ్ పరాశర్ తో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ విశాఖపట్నంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ...పూణే లిక్విడ్ రోబోటిక్స్ కో–ప్రొడక్షన్ మోడల్ ను జువ్వలదిన్నెలో ఇండో–పసిఫిక్ కోసం ఎక్స్ పోర్ట్ హబ్ గా రెప్లికేట్ చేయాలని కోరారు. IIT తిరుపతి, ఆంధ్రా యూనివర్సిటీ (మెరైన్ ఇంజనీరింగ్) తో కలిసి మారిటైమ్ అటానమీ, రోబోటిక్స్ స్కిల్లింగ్ సెంటర్ ఏర్పాటు చేయండి. తూర్పు తీరంలో ఈస్టర్న్ నేవల్ కమాండ్, కోస్ట్ గార్డ్ కోసం మానవరహిత నౌకల సీ ట్రయల్స్, వీ=ూ, ఫ్లీట్ సపోర్ట్ కోసం జువ్వలదిన్నెకు స్థానం కల్పించేందుకు కృషిచేస్తాం. నిర్దేశిత సీ–ట్రయల్ ఏరియాకు ఏపీ ప్రభుత్వం మద్దతు ఇస్తుంది. ఏపీ మారిటైమ్ బోర్డ్ పోర్టులలో హార్బర్ సెక్యూరిటీ, హైడ్రోగ్రాఫిక్ సర్వే కోసం ఖూం ల పైలట్, కృష్ణా–గోదావరి బేసిన్ లో చమురు, గ్యాస్ ఆపరేటర్ల కోసం ఆఫ్ షోర్ తనిఖీ, APSDMA తో తుఫాను, వరద ప్రతిస్పందన కోసం ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేయండి. ఎండ్యూర్ ఎయిర్ / సాగర్ ఖూం లైన్ ను ఏపీకి ఆహ్వానిస్తున్నాం. టైర్–2 సప్లయర్లను (కాంపోజిట్స్, బ్యాటరీలు, సెన్సార్లు, ఎలక్ట్రానిక్స్) నెల్లూరుకు తీసుకురండి. జువ్వలదిన్నె చుట్టూ మత్స్యకార కమ్యూనిటీల నుంచి ప్రాధాన్యత హైరింగ్, స్మార్ట్ ఫిషింగ్ ఫ్లీట్ నెట్ వర్క్ ను త్వరగా అభివృద్ధి చేయాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు. సాగర్ డిఫెన్స్ ఫౌండర్ నికుంజ్ పరాశర్ మాట్లాడుతూ... తమ సంస్థ బోయింగ్ కంపెనీ అయిన లిక్విడ్ రోబోటిక్స్, ఏరియల్ రోబోటిక్స్ సంస్థ ఎండ్యూర్ ఎయిర్ సిస్టమ్స్ లో వ్యూహాత్మక పెట్టుబడులు పెట్టినట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని అన్నారు.

స్పేస్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్

(మొదటి పేజీ తరువాయి)



ఒక రంగాన్ని ఎంపిక చేసుకోవడం, ఆ రంగంలో పనిచేస్తున్న సంస్థలు, భాగస్వాములను గుర్తించడం, క్రమపద్ధతిలో పెట్టుబడులను ఆకర్షించడం, ఆయా రంగాలకు చెందిన కంపెనీలను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకురావడం మా విధానం. దీనినే వర్టికల్, హారిజాంటల్ ఇంటిగ్రేషన్ అంటారు. వర్టికల్ ఇంటిగ్రేషన్ ద్వారా స్కైరూట్ వంటి అంతరిక్ష సంస్థలకు అవసరమైన విడిభాగాలను తయారు చేసే ఉపకరణాల తయారీ సంస్థలను ఒకే ఎకోసిస్టమ్‌లోకి తీసుకురావడం లక్ష్యం. ఈ సంస్థలు తయారు చేసే విడిభాగాలు, ఉపవ్యవస్థల సహకారంతో స్కైరూట్ వంటి కంపెనీలు తమ రాకెట్ వాహనాలను రూపొందించి అంతరిక్షంలోకి ప్రయోగించగలుగుతాయి.

పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలి : హారిజాంటల్ ఇంటిగ్రేషన్ విషయానికి వస్తే.. ఇక్కడ విద్యాసంస్థలు, పరిశ్రమలు కలిసి పనిచేయడం కీలకం. మన అకడమిక్ కరిక్యులమ్ ను ఆధునీకరించడం, పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వడం, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ద్వారా పరీక్షలు, సర్టిఫికేషన్ వంటి సదుపాయాలను అభివృద్ధి చేయడం ఇందులో భాగం. ఇప్పటికే ఇంధన రంగంలో ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయడానికి ఐఐటీ తిరుపతితో కలిసి పనిచేస్తున్నాం. ఎందుకంటే ఆ ప్రాంతంలోని పారిశ్రామిక క్లస్టర్‌కు అనేక ఇంగాట్, సోలార్, వేఫర్, సెల్ తయారీ సంస్థలు వచ్చాయి.

స్పేస్ సిటీ అభివృద్ధికి అవసరమైన పాలసీని రూపొందించాలి : ప్రస్తుతం దేశానికి అవసరమైనది స్పేస్ సిటీ అభివృద్ధికి అనుసంధానమైన సమగ్ర విధానం. అంతరిక్ష పరిశ్రమల ఏర్పాటు, వాటికి సంబంధించిన సంస్థలన్నింటినీ ఒకే వ్యవస్థలో అనుసంధానించే విధానాన్ని భారతదేశం ఇప్పుడు రూపొందించాల్సిన అవసరం ఉంది.

ఆ తర్వాత రాష్ట్రాలు దూకుడుగా ముందుకు వెళ్లాలి. స్కైరూట్ వంటి కంపెనీలను లక్ష్యంగా చేసుకుని రాష్ట్రాలకు తీసుకురావాలి. అనంతరం ఆ రంగానికి సంబంధించిన అన్ని సంస్థలు, విడిభాగాల తయారీదారులు, సరఫరాదారులను క్రమపద్ధతిలో గుర్తించాలి. వీరిలో అత్యధికులు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమదారులే. ఈరోజు నేను ఒక ఎంఎస్ఎంఈ సంస్థను కలిశాను. వారు రాకెట్‌కు అవసరమైన షీల్డ్‌ను తయారు చేస్తున్నారు. వారు ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్‌లో కూడా పాల్గొన్నారు. ఇలాంటి సంస్థలన్నింటినీ ఒకే ఎకోసిస్టమ్‌లోకి తీసుకురావడమే అసలైన మార్పును తీసుకొస్తుంది.

ఏపీ ఎన్డీయే పాలిత రాష్ట్రం. రాజకీయంగా కూడా కేంద్ర ప్రభుత్వంలో మాకు భాగస్వామ్యం ఉంది. అందువల్ల రాష్ట్ర ప్రయోజనాలతో పాటు దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విధానాల్లో సానుకూల మార్పులు తీసుకురావడంలో మా వంతు పాత్ర పోషించే అవకాశం మాకు ఉంది. అనేక రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటే, ఏపీలో మాత్రం డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉంది. ఎందుకంటే ఇతర రాష్ట్రాలు అందుకోలేని వేగంతో ముందుకు వెళ్లగలిగే ఇద్దరు గొప్ప నాయకులు మనకు ఉన్నారు. మొత్తం అంతరిక్ష ఎకోసిస్టమ్ అభివృద్ధిలో రాష్ట్ర ప్రభుత్వం పోషించగలిగే పాత్ర ఇదే.

ఆంధ్రప్రదేశ్ స్పేస్ పాలసీ 4.0, ప్రతిపాదిత తిరుపతి స్పేస్ సిటీ వంటి కార్యక్రమాల ద్వారా అంతరిక్ష, ఏరోస్పేస్ పరిశ్రమలకు ఒక ముఖ్యమైన గమ్యస్థానంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తోంది. రాబోయే ఐదేళ్లలో భారతదేశ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ ఏ విధమైన గుర్తింపు పొందాలని మీరు కోరుకుంటున్నారు, అలాగే ఇతర ప్రాంతాలతో పోలిస్తే ప్రపంచస్థాయి అంతరిక్ష సంస్థలు ఏపీని ఎంచుకునేలా చేసే ఒక ప్రధాన ప్రత్యేకత ఏమిటనే ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ.. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేకత స్పీడ్. మేం పనులను చాలా వేగంగా పూర్తి చేస్తాం. ఎందుకంటే ఇక్కడ ఉన్న యువత అవకాశాల కోసం అన్వేషిస్తున్నారు. తమ కెరీర్‌ను నిర్మించుకోవాలని కోరుకుంటున్నారు. అందుకే ఇతర రాష్ట్రాలతో పోటీపడటంలో ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకమైన బలం మా పని వేగమే. ఇది మొదటి అంశం.

పాశ్చాత్య దేశాల్లో, అలాగే చైనాలో జరుగుతున్న పరిణామాలను మీరందరూ గమనిస్తూనే ఉంటారు. వారు అంతరిక్ష ప్రయోగాల ఖర్చును ఏ విధంగా తగ్గించగలుగుతున్నారు? ఈ అంశంపై మనమందరం కలిసి ఆలోచించాలి. సమష్టిగా ఒక వ్యూహాన్ని రూపొందించాలి. అంతరిక్ష ప్రయోగాల వ్యయాన్ని గణనీయంగా తగ్గించడానికి ప్రైవేట్ రంగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ విధంగా కలిసి పనిచేయాలన్నది మనం నిర్ణయించుకోవాలి. ఎందుకంటే అంతరిక్ష రంగంలో అసలైన ప్రత్యేకత ఇదే. ఈ రంగం మధ్యకాలిక, దీర్ఘకాలిక అభివృద్ధికి, సుస్థిరతకు ఇది ఎంతో కీలకమని నేను విశ్వసిస్తున్నాను.

అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ చుట్టూ ఒక సమగ్ర ఎకోసిస్టమ్ అభివృద్ధి చెందాలని నేను కోరుకుంటున్నాను. ప్రస్తుతం మనం ఈ రంగంలో అవకాశాలను అర్థం చేసుకునే ప్రారంభ దశలోనే ఉన్నాం. ఇక్కడ ప్రాతినిధ్యం వహిస్తున్న అద్భుతమైన స్టార్టప్ సంస్థలను చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉంది. ఈ రంగంలో మనం ఒక సానుకూల ఉత్సాహాన్ని, ఆసక్తిని సృష్టించగలిగామని నేను భావిస్తున్నాను. కేవలం ప్రోత్సాహకాలతో ఒక ఎకోసిస్టమ్‌ను నిర్మించలేం. ఇందుకు విధానపరమైన ఆలోచనలు, నాయకత్వం కలిగిన వారందరినీ ఒకచోట చేర్చడం అవసరం. పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపైకి తీసుకురావాలి. విద్యాసంస్థలను భాగస్వాములుగా చేయాలి. పరిశ్రమలు, విద్యాసంస్థలు, పెట్టుబడిదారుల మధ్య సమన్వయం కల్పించాల్సిన అవసరం ఉంది. ఇవన్నీ కలిసినప్పుడే ఒక బలమైన, అభివృద్ధి చెందుతున్న ఎకోసిస్టమ్‌ను సృష్టించగలం. ఆంధ్రప్రదేశ్‌లో మనం చూడబోయేది ఇదే. గౌరవ సీఎం గారు ఒక లక్ష్యాన్ని కలగంటే.. దాన్ని సాకారం చేస్తారు. ఆయన కలలను నిజం చేయడం మా బాధ్యత అని మంత్రి చెప్పారు.

ఈ కార్యక్రమంలో ఇస్రో ఇండియన్ ఆస్ట్రోనాట్ ఎయిర్ కమోడోర్ ప్రశాంతి బి. నాయర్, అగ్నికుల్ కో–ఫౌండర్, సీఈవో శ్రీనాథ్ రవిచంద్రన్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కే. ఎన్. సత్యనారాయణ, గెలాక్స్‌ఐ ఫౌండర్, సీఈవో సుయాష్ సింగ్, స్కైరూట్ ఏరోస్పేస్ కో–ఫౌండర్, సీటీవో డాకా నాగ భరత్ పాల్గొన్నారు.

లోకేష్ సమక్షంలో పెట్టుబడుల వరద

విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : విశాఖలో జరుగుతున్న సిఐఐ 31వ భాగస్వామ్య సదస్సు రెండోరోజు కూడా రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువెత్తాయి. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సమక్షంలో 24 కంపెనీలు రూ. 1,05,634 కోట్ల విలువైన పెట్టుబడులు పెట్టేందుకు ఏపీ ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్ర యువతకు 75,055 ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయి. ఏరో స్పేస్, ఐటి ఉ ఎలక్ట్రానిక్స్, డాటా సెంటర్స్, సెమీ కండక్టర్స్, హెల్త్ కేర్, రెన్యువబుల్ ఎనర్జీ రంగాల్లో పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. ఎఎం ఎఐ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 31,387 కోట్లతో ఇంటిగ్రేటెడ్ ఎఐ డాటా సెంటర్, పంచశీల్ రియాల్టీ -- రూ. 37,000 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. మంత్రి లోకేష్ సమక్షంలో ఇన్వెస్టర్లు కుదుర్చుకున్న ఎంఓయూలు, జిఓ ఎక్స్చేంజిల వివరాలు ఇలా ఉన్నాయి.



రెండోరోజు ఒప్పందాల వివరాలు

1. SALVO ఇండస్ట్రీస్ – రూ. 800 కోట్ల పెట్టుబడి – 2,000 ఉద్యోగాలు
2. బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్ – రూ. 550 కోట్ల పెట్టుబడి – 565 ఉద్యోగాలు
3. ఐజీ డిఫెన్స్ – రూ. 500 కోట్ల పెట్టుబడి – 1,000 ఉద్యోగాలు
4. ఆర్చియన్ గ్రూప్ – రూ. 2,000 కోట్ల పెట్టుబడి – 1,200 ఉద్యోగాలు
5. కెయిన్స్ టెక్నాలజీ ఇండియా – రూ. 3,145 కోట్ల పెట్టుబడి – 2,000 ఉద్యోగాలు
6. ఎఐఎల్ డిక్సాన్ టెక్నాలజీస్ – రూ. 450 కోట్ల పెట్టుబడి – 7,000 ఉద్యోగాలు
7. పంచషిల్ రియాల్టీ (హైపర్ స్కేల్ డాటా సెంటర్) – రూ. 37,000 కోట్ల పెట్టుబడి – 32,000 ఉద్యోగాలు
8. వారీ ఎనర్జీస్ – రూ. 10,000 కోట్ల పెట్టుబడి – 1,000 ఉద్యోగాలు
9. క్లీన్‌మాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ – రూ. 8,000 కోట్ల పెట్టుబడి – 50 ఉద్యోగాలు
10. ఈపాక్ డేటా సెంటర్ సొల్యూషన్స్ – రూ. 570 కోట్ల పెట్టుబడి – 2,565 ఉద్యోగాలు
11. ఆఫీస్ స్పేస్ సొల్యూషన్స్ – రూ. 10 కోట్ల పెట్టుబడి – 100 ఉద్యోగాలు
12. హెరిబా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ – వర్క్ ఫోర్స్ ట్రైనింగ్ ఎంఓయు
13. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రోగ్రామ్ – క్లైమేట్ రెస్పాన్స్ అర్బన్ ప్లానింగ్, అమరావతి ఎంఓయు.
14. సముద్ర సూర్య రాజా – రూ. 100 కోట్ల పెట్టుబడి – 50 ఉద్యోగాలు
15. పీవీఎస్ రామ్మోహన్ హెల్త్ కేర్ – రూ. 312 కోట్ల పెట్టుబడి – 1,500 ఉద్యోగాలు
16. సబ్ స్టేట్ మాన్యుఫాక్చరింగ్ ఇండియా – రూ. 931 కోట్ల పెట్టుబడి – 4,000 ఉద్యోగాలు
17. ఇన్ఫినిటీ – రూ. 250 కోట్ల పెట్టుబడి – 1,100 ఉద్యోగాలు
18. సైయింట్ ఖావీ ఉ హిందుస్థాన్ షిప్ యార్డ్ – రూ. 1,000 కోట్ల పెట్టుబడి
19. ఎఎం ఎఐ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ – రూ. 31,387 కోట్ల పెట్టుబడి –1000 ఉద్యోగాలు
20. కిమ్స్ హాస్పటల్స్ – 1,500 కోట్ల పెట్టుబడి – 2000 ఉద్యోగాలు
21. యోధ హెల్త్‌కేర్ ఉ హాస్పటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ – 1,359 కోట్ల పెట్టుబడి – 4,925 ఉద్యోగాలు
22. పవన్ హాన్స్ హెలీ పోర్ట్స్ అభివృద్ధికి ఎంఓయు
23. స్మాక్స్ డిజిటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎపి స్పోర్ట్స్ విలేజ్) – రూ. 4,270 కోట్ల పెట్టుబడి – 8,000 ఉద్యోగాలు
24. స్మాక్స్ డిజిటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ – రూ. 1,500 కోట్ల పెట్టుబడి – 3,000 ఉద్యోగాలు

విద్యుత్ సంస్కరణల్లో ఏపీ విప్లవాత్మక మార్పులు



(మొదటి పేజీ తరువాయి)

భాగం కార్యరూపం దాల్చుతోందని తెలిపారు. క్లీన్ ఎనర్జీ రంగంలో ఇప్పటికే 114 గిగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి ఒప్పందాలు చేసుకోవడం ప్రశంసనీయమన్నారు. గ్రీన్ ఎనర్జీ అభివృద్ధికి కేంద్రం కేటాయించిన రూ. లక్ష కోట్లకు పైగా నిధులను ఆంధ్రప్రదేశ్ గరిష్ఠంగా వినియోగించుకోవాలని సూచించారు.

దేశంలో సమర్థవంతంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రుల్లో చంద్రబాబు ఒకరని ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద ఇప్పటికే ఆంధ్రప్రదేశ్‌కు 7.8 లక్షల యూనిట్లు కేటాయించినట్లు వెల్లడించారు.

ఏపీ ప్రగతికి 'టైమ్' ప్రశంస



(మొదటి పేజీ తరువాయి)

కేవలం ఆరు నెలల్లోనే 2026 ఏప్రిల్‌లో శంకుస్థాపన జరిగిందని ముఖ్యమంత్రి వివరించారు. ప్రభుత్వ నిర్ణయాల్లో వేగం, పెట్టుబడుల అమలులో చిత్తశుద్ధి ఎలా ఉంటాయో చెప్పడానికి ఇదొక ప్రత్యక్ష ఉదాహరణగా పేర్కొన్నారు.

అద్భుత నాయకత్వం–అసాధారణ అభివృద్ధి : ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడుల పురోగతిని ప్రపంచానికి పరిచయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు 'టైమ్' ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. వచ్చే ఏడాది మరోసారి ఆంధ్రప్రదేశ్‌కు రావాలని, అప్పటికి రాష్ట్రం సాధించిన ప్రగతిని స్వయంగా పరిశీలించి ప్రపంచానికి తెలియజేయాలని 'టైమ్' సంస్థను ఆహ్వానించారు. 'టైమ్' ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ డామియన్ డగ్లస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వం, రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న అసాధారణ అభివృద్ధి తనకు ఎంతో ఆసక్తి కలిగించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సాధిస్తున్న అనేక విజయాలు...అద్భుత నాయకత్వం, దార్శనికతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ విజయగాథను, రాష్ట్ర అభివృద్ధి నమూనాను ప్రపంచానికి పరిచయం చేస్తామని డగ్లస్ వెల్లడించారు.

'బిల్డ్ ద నెక్స్ట్ చాప్టర్ ఆఫ్ గ్రోత్'పై ప్యానల్ చర్చ : ముఖ్యమంత్రి ముఖాముఖి అనంతరం 'బిల్డ్ ద నెక్స్ట్ చాప్టర్ ఆఫ్ గ్రోత్' అనే అంశంపై ప్రత్యేక ప్యానెల్ చర్చ నిర్వహించారు. వరాహ క్లైమేట్ఏజీకి చెందిన మధుర్ జైన్, పబ్లిసిస్ గ్రూప్ సీఈఓ అనుప్రియ ఆచార్య, ఇసుజు మోటార్స్ ఇండియా ప్రెసిడెంట్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ మిట్టల్, ఆసియా అభివృద్ధి బ్యాంకు సౌత్ ఆసియా విభాగం ఇండియా రెసిడెంట్ మిషన్ కంట్రీ డైరెక్టర్ మియో ఓకా పాల్గొన్నారు. టైమ్100 నెక్స్ట్ ఇండియా సీనియర్ ప్రొడ్యూసర్, ప్రాజెక్ట్ డైరెక్టర్ గాయత్రి రంగాచారి షా ఈ చర్చకు మోడరేటర్‌గా వ్యవహరించారు. ప్రపంచ వృద్ధికి దోహదపడే భాగస్వామ్యాలు, భవిష్యత్ అవకాశాలు, పెట్టుబడులు, సుస్థిర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వారు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

కలిసి పనిచేద్దాం.. కలిసి ఎదుగుదాం



(మొదటి పేజీ తరువాయి)

పోర్టులను అనుసంధానిస్తూ జాతీయ రహదారులు, గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు నిర్మాణ ప్రతిపాదన కేంద్ర మంత్రివర్గ ఆమోదం దశకు చేరుకుందని వెల్లడించారు.

విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజు కార్యక్రమంలో పాల్గొన్న గడ్కరీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో ఇతర రాష్ట్రాలతో ఆంధ్రప్రదేశ్‌ను అనుసంధానించే రహదారుల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. దేశ ఆర్థికాభివృద్ధిలో పోర్టులు కీలకమని, విశాఖ, గంగవరం, కాకినాడ, మచిలీపట్నం వంటి ఓడరేవులను మరింత అభివృద్ధి చేయడం ద్వారా ఎగుమతులు, దిగుమతులకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు.

ఎగుమతులు, దిగుమతుల వ్యయాన్ని తగ్గించాలంటే రవాణా, లాజిస్టిక్స్ ఖర్చులను గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ లక్ష్యంతో జాతీయ రహదారులు, గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. బెంగళూరు–విజయవాడ కారిడార్ వల్ల ప్రయాణ దూరం 110 కిలోమీటర్లు తగ్గుతుందని తెలిపారు.

రాయపూర్–విశాఖపట్నం కారిడార్ నిర్మాణం 96 శాతం పూర్తయిందని, ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని చెప్పారు. దేశంలోనే అత్యంత ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల్లో ఇదొకటని పేర్కొన్నారు. విశాఖ–మచిలీపట్నం కారిడార్ కూడా రాష్ట్ర అభివృద్ధికి కీలకంగా మారుతుందని వివరించారు.

బెంగళూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం వచ్చే జనవరి నాటికి పూర్తవుతుందని గడ్కరీ తెలిపారు. ఈ రహదారి ద్వారా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని చెప్పారు. ఖరగ్‌పూర్–అమరావతి కారిడార్ నిర్మాణం పూర్తయితే రాష్ట్రానికి మరిన్ని ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. ఉత్తర, దక్షిణ భారతదేశాలను అనుసంధానించేందుకు పలు కారిడార్ల నిర్మాణం కొనసాగుతోందని వెల్లడించారు. అమరావతి చుట్టూ 192 కిలోమీటర్ల పొడవైన రింగ్‌రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని, ఈ ప్రాజెక్టు రాజధాని ప్రాంత అభివృద్ధికి, రవాణా వ్యవస్థ మెరుగుదలకు దోహదపడుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

పెట్టుబడులకు ఏపీ భరోసా



(మొదటి పేజీ తరువాయి)

తొమ్మిదోసారి విశాఖపట్నంలో ఈ అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సును నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రెండు రోజుల పాటు జరిగిన సదస్సు విజయవంతమైందని పేర్కొన్నారు.

ఈ సదస్సులో ఆసియా నుంచి ఆఫ్రికా వరకు వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొనడం రాష్ట్రానికి అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న గుర్తింపును తెలియజేస్తోందన్నారు. దేశవిదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, ప్రభుత్వ ప్రతినిధులు, పెట్టుబడిదారులు ఒకే వేదికపైకి రావడం ద్వారా రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు.


పోలవరం ప్రాజెక్టు, విశాఖ స్టీల్ ప్లాంట్, తూర్పు కోస్తా రైల్వే జోన్ వంటి కీలక ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వ సహకారంతో సాకారమవుతున్నాయని గవర్నర్ పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం కీలకమని తెలిపారు.

సదస్సులో పాల్గొన్న దేశవిదేశీ ప్రతినిధులు, ప్రభుత్వ ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలకు గవర్నర్ అభినందనలు తెలిపారు.

జర్నలిస్ట్ ఫైల్
JOURNALIST FILE
సంపాదక స్వరం
EDITORIAL
ప్రజా ప్రయోజనం | వాస్తవ విశ్లేషణ | బాధ్యతాయుత అభిప్రాయం

మహిళా కోటాపై కేంద్రం కొత్త రాజకీయ చదరంగం

- ప్రత్యేక పార్లమెంటు సమావేశాలపై కేంద్రం కసరత్తు..
- 15-18 ఓట్ల ఆధిక్యంపై ఎన్డీయే ధీమా..
- మహిళా ప్రాతినిధ్యం పేరుతో రాజకీయ సమీకరణలకు పదును పెడుతున్న అధికార పక్షం



మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే లక్ష్యం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక కీలకమైన సంస్కరణ. దశాబ్దాలుగా చర్చల్లో ఉన్న ఈ అంశం చట్టరూపం దాల్చినప్పటికీ, దాని అమలు విషయంలో నెలకొన్న రాజకీయ, రాజ్యాంగపరమైన పరిణామాలు మరోసారి దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమవుతున్నాయి. మహిళా రిజర్వేషన్ల చట్టానికి సవరణలు తీసుకొచ్చేందుకు ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ ఆలోచన ఈ నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకుంది. బిల్లును 15 నుంచి 18 ఓట్ల ఆధిక్యంతో ఆమోదింపజేయగలమన్న అధికార పక్షం ధీమా కేవలం సంఖ్యాబలంపై ఉన్న విశ్వాసమేనా? లేక మహిళా సాధికారతను రాజకీయంగా ఉపయోగించుకునే వ్యూహంలో భాగమా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

మహిళా రిజర్వేషన్ల వెనుక నియోజకవర్గాల పునర్విభజన అసలు ఎజెండా! : మహిళా రిజర్వేషన్ల అంశాన్ని విడిగా పరిశీలిస్తే అది దేశ ప్రజాస్వామ్యానికి అవసరమైన పురోగామి నిర్ణయం. కానీ దానిని నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టినప్పుడు సమస్య కేవలం మహిళలకు ప్రాతినిధ్యం కల్పించడానికే పరిమితం కావడం లేదు. దేశ రాజకీయ అధికార సమతుల్యత, రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తులు, సమాఖ్య వ్యవస్థ భవిష్యత్తు వంటి అత్యంత కీలకమైన అంశాలు తెరపైకి వస్తున్నాయి. ఇక్కడే కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనపై లోతైన విశ్లేషణ అవసరమవుతోంది.

2023లో పార్లమెంటు ఆమోదించిన 106వ రాజ్యాంగ సవరణ ద్వారా మహిళలకు లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టానికి మార్గం సుగమమైంది. అయితే జనగణన, అనంతర నియోజకవర్గాల పునర్విభజనతో ఈ రిజర్వేషన్ల అమలును ముడిపెట్టడం వల్ల తక్షణ అమలుకు అవకాశం లేకుండా పోయింది. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యం ఎంత ముఖ్యమో, దాని అమలును అనవసరంగా ఆలస్యం చేయకూడదన్నది కూడా అంతే ముఖ్యం.

కానీ కేంద్రం ఇప్పుడు ముందుకు తెస్తున్న ప్రతిపాదనలో లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుత 543 నుంచి గరిష్ఠంగా 850కు పెంచడం, నియోజకవర్గాల పునర్విభజన ద్వారా మహిళా రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయడం ప్రధానాంశాలుగా కనిపిస్తున్నాయి. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను ప్రస్తుత సంఖ్యకు అదనంగా 50 శాతం పెంచడం ద్వారా దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను తగ్గించవచ్చని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. అంతర్రాష్ట్ర స్థానాల నిష్పత్తిని 1971 జనగణన ఆధారంగా యథాతథంగా కొనసాగించే అంశం కూడా పరిశీలనలో ఉన్నట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే ఇవి ఇంకా తుది నిర్ణయాలు కావు.

ఇక్కడే అసలు రాజకీయ చిక్కు ఉంది. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే జనాభా వేగంగా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ స్థానాలు లభించే అవకాశం ఉంటుంది. మరోవైపు కుటుంబ నియంత్రణ, విద్య, ఆరోగ్యం, మహిళా సాధికారత వంటి రంగాల్లో ముందంజలో ఉండి జనాభా పెరుగుదలను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాలు తమ రాజకీయ ప్రాధాన్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. జనాభా నియంత్రణలో విజయం సాధించిన రాష్ట్రాలకు రాజకీయ ప్రాతినిధ్యంలో శిక్ష పడకూడదన్నది దక్షిణాది వాదనలోని న్యాయమైన అంశం.

ఒక రాష్ట్రం జనాభా నియంత్రణలో విఫలమైతే దానికి ఎక్కువ పార్లమెంటు స్థానాలు, జనాభా నియంత్రణలో విజయం సాధిస్తే తక్కువ రాజకీయ ప్రాధాన్యం లభించే పరిస్థితి ఏర్పడితే అది సమాఖ్య న్యాయసూత్రాలకు విరుద్ధమైన సందేశాన్ని ఇస్తుంది. అందువల్ల స్థానాల పెంపు ఒక్కటే పరిష్కారం కాదు. ఆ పెంపు రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తిని ఎలా ప్రభావితం చేస్తుంది? లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రస్తుత రాజకీయ బలం కొనసాగుతుందా? భవిష్యత్తులో జనాభా ఆధారిత పునర్విభజనకు ఎలాంటి హద్దులు ఉంటాయి? అనే అంశాలపై రాజ్యాంగపరమైన స్పష్టత అవసరం.

ఏప్రిల్ ఓటమి.. నవంబర్‌లో కొత్త రాజకీయ లెక్కలు : ఈ ఏడాది ఏప్రిల్ 17న లోక్‌సభలో ఇలాంటి రాజ్యాంగ సవరణ బిల్లు అవసరమైన ప్రత్యేక మెజారిటీ సాధించలేకపోయింది. బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 ఓట్లు వచ్చాయి. రాజ్యాంగ సవరణకు అవసరమైన మూడింట రెండొంతుల మద్దతు లభించకపోవడంతో ప్రభుత్వం రాజకీయంగా ఎదురుదెబ్బ తిన్నది. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని, వాటితో నియోజకవర్గాల పునర్విభజనను ముడిపెట్టడమే తమ అభ్యంతరమని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి.

ఆ ఓటమి నుంచి కేంద్ర ప్రభుత్వం గుణపాఠం నేర్చుకుందా? లేక సంఖ్యాబలాన్ని సమీకరించుకునే రాజకీయ ప్రయత్నాలకు పదును పెట్టిందా? అన్నది ఇప్పుడు కీలక ప్రశ్న. తాజా సమాచారం ప్రకారం బిల్లును ఆమోదింపజేయడానికి అవసరమైన సంఖ్య కంటే 15 నుంచి 18 ఓట్లు అధికంగా తమకు లభిస్తాయని ఎన్డీయే వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. అందుకోసం ప్రాంతీయ పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ) వంటి పార్టీల వైఖరి ఈ పరిణామాల్లో కీలకం కానుంది.

కానీ రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించడం సాధారణ మెజారిటీ వ్యవహారం కాదు. సభ మొత్తం సభ్యత్వంలో మెజారిటీతో పాటు, హాజరై ఓటు వేసిన సభ్యుల్లో కనీసం మూడింట రెండొంతుల మద్దతు తప్పనిసరి. ప్రస్తుత లోక్‌సభలో 543 స్థానాల ప్రాతిపదికన సభ్యులందరూ హాజరై ఓటు వేస్తే 361 ఓట్లు అవసరమవుతాయి. పైగా రాజ్యాంగ సవరణకు ఉభయ సభల్లో విడివిడిగా ప్రత్యేక మెజారిటీ సాధించాలి. సంయుక్త సమావేశం ద్వారా ఈ అడ్డంకిని అధిగమించే అవకాశం లేదు. అందువల్ల లోక్‌సభలో సంఖ్యాబలం ఉందన్న ప్రకటనతోనే బిల్లు ఆమోదం ఖాయమైందని భావించలేం.

ప్రత్యేక సమావేశం.. ప్రజాస్వామ్య సంప్రదాయాలపై ప్రశ్నలు : వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13న నిరవధికంగా వాయిదా పడినప్పటికీ, వాటికి ఇంకా అధికారికంగా ప్రొరోగేషన్ ప్రకటించకపోవడం మరో ఆసక్తికర పరిణామం. ఈ కారణంగా కనీసం రెండు రోజుల నోటీసుతో అదే సమావేశాలను తిరిగి కొనసాగించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కొత్త సమావేశాన్ని ఏర్పాటు చేయాలంటే సాధారణంగా 14 రోజుల నోటీసు అవసరం. గతంలోనూ పార్లమెంటు సమావేశాలను ఎక్కువకాలం ప్రొరోగ్ చేయకుండా ఉంచిన సందర్భాలు ఉన్నందున ఈ విధానం స్వతహాగా రాజ్యాంగ విరుద్ధమని చెప్పలేం. అయితే అత్యంత కీలకమైన రాజ్యాంగ సవరణను హడావుడిగా చేపట్టకుండా విస్తృత చర్చకు అవకాశం కల్పించాలి.

ప్రత్యేక సమావేశాల నిర్వహణపై కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ఇప్పటికే విమర్శలు గుప్పించారు. ఏప్రిల్‌లోనూ ఇలాంటి ధీమా వ్యక్తం చేసి ఓటమిని ఎదుర్కొన్నారని, ఇప్పుడు మళ్లీ అదే రాజకీయ ప్రచారానికి తెరతీశారని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు కేంద్రం ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు చెబుతోంది. అయితే చర్చల ద్వారా ఏకాభిప్రాయం సాధించడం, రాజకీయ ఒత్తిళ్లతో సంఖ్యాబలాన్ని సమీకరించడం రెండూ వేర్వేరు. రాజ్యాంగ సవరణ విషయంలో మొదటి మార్గానికే ప్రాధాన్యం ఉండాలి.

మహిళా సాధికారత అంటే కేవలం సీట్ల కేటాయింపు కాదు : మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం చారిత్రక అవసరమే. దేశ జనాభాలో దాదాపు సగం ఉన్న మహిళలకు చట్టసభల్లో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం ప్రజాస్వామ్యంలోని ఒక ప్రధాన లోపం. రాజకీయ పార్టీలు మహిళలకు టికెట్లు ఇచ్చే విషయంలో చూపుతున్న నిర్లక్ష్యం, ఎన్నికల వ్యయాలు, రాజకీయాల్లో పురుషాధిపత్యం, సామాజిక అడ్డంకులు మహిళల రాజకీయ ఎదుగుదలకు ఇప్పటికీ అవరోధాలుగానే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో రిజర్వేషన్లు మహిళలకు రాజకీయ ప్రవేశానికి ఒక బలమైన వేదికను కల్పిస్తాయి.

అయితే మహిళా రిజర్వేషన్ల అమలును నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడం వల్ల అసలు లక్ష్యం మరుగున పడకూడదు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే విషయంలో రాజకీయ పార్టీల మధ్య ఏకాభిప్రాయం ఉన్నప్పుడు, వాటి అమలుకు అవసరమైన రాజ్యాంగపరమైన మార్గాన్ని కూడా సాధ్యమైనంత త్వరగా అన్వేషించాలి. అదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన వంటి విస్తృత ప్రభావం చూపే ప్రక్రియకు ప్రత్యేకమైన చర్చ, పారదర్శకత, న్యాయమైన ప్రమాణాలు అవసరం.

ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ల ద్వారా అన్ని సామాజిక వర్గాల మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం అందేలా చూడాలి. రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల మహిళలు కూడా చట్టసభల్లోకి ప్రవేశించే అవకాశాలు పొందాలి. మహిళా సాధికారతను కేవలం ఎన్నికల నినాదంగా కాకుండా నిర్ణయాధికారంలో సమాన భాగస్వామ్యంగా చూడాలి.

దక్షిణాది ఆందోళనలకు కేంద్రం సమాధానం చెప్పాలి : ఈ పరిణామాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాల వైఖరి అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. జనాభా నియంత్రణలో సాధించిన విజయాలు, విద్యా ప్రమాణాలు, ఆరోగ్య రంగంలో పురోగతి, ఆర్థికాభివృద్ధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యాన్ని నిర్ణయించడం సమంజసం కాదు. అన్ని రాష్ట్రాలకు అదనంగా 50 శాతం స్థానాలు కేటాయిస్తామన్న ప్రతిపాదన స్వాగతించదగినదే అయినప్పటికీ, దాని అమలుకు రాజ్యాంగపరమైన హామీ అవసరం.

దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను రాజకీయ వ్యతిరేకతగా కొట్టిపారేయడం సరికాదు. ఇది ఉత్తరాది, దక్షిణాది మధ్య రాజకీయ ఆధిపత్య పోరు కాదు. దేశ సమాఖ్య వ్యవస్థలో ప్రతి రాష్ట్రానికి సముచిత ప్రాతినిధ్యం ఉండాలన్న మౌలిక సూత్రానికి సంబంధించిన అంశం. నేడు జనాభా ప్రాతిపదికన తీసుకునే నిర్ణయాలు రేపటి పార్లమెంటరీ రాజకీయాలను, కేంద్ర ప్రభుత్వాల ఏర్పాటులో రాష్ట్రాల పాత్రను ప్రభావితం చేయగలవు. అందువల్ల ఈ విషయంలో అన్ని రాష్ట్రాలకు ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనాలి.


రాజకీయ ప్రయోజనాల కంటే రాజ్యాంగ విలువలే ముఖ్యం : 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లను అమల్లోకి తీసుకురావాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం రాజకీయంగా ప్రాధాన్యం కలిగినదే. అయితే ఎన్నికల కాలపరిమితిని దృష్టిలో పెట్టుకుని రాజ్యాంగపరమైన అంశాలపై తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. ప్రభుత్వం తన ప్రతిపాదనలోని ప్రతి అంశాన్ని పారదర్శకంగా వెల్లడించాలి. రాష్ట్రాలవారీగా స్థానాల పెంపు ఎలా ఉంటుంది? ప్రస్తుత ప్రాతినిధ్య నిష్పత్తి ఎలా రక్షించబడుతుంది? భవిష్యత్తులో జనాభా ఆధారిత పునర్విభజనకు ఎలాంటి పరిమితులు ఉంటాయి? మహిళా రిజర్వేషన్ల అమలుకు నిర్దిష్ట కాలపరిమితి ఏమిటి? వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలి.

మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించే రాజకీయ శక్తిగా ప్రతిపక్షాన్ని చిత్రీకరించడం ఎంతవరకు సరికాదో, నియోజకవర్గాల పునర్విభజనపై ఉన్న ఆందోళనలను రాజకీయ కుట్రగా కొట్టిపారేయడం కూడా అంతే సరికాదు. మహిళా రిజర్వేషన్లకు మద్దతు తెలుపుతూనే, దేశ సమాఖ్య వ్యవస్థకు విఘాతం కలిగించే అంశాలను ప్రశ్నించడం ప్రతిపక్షాల బాధ్యత. అదే సమయంలో మహిళలకు రాజకీయ అధికారాన్ని అందించడంలో ఇకపై ఆలస్యం జరగకుండా చూడటం కూడా వాటి బాధ్యతే.

అంతిమంగా మహిళా రిజర్వేషన్లు అధికార పక్షానికి ఎన్నికల విజయానికి ఉపయోగపడే రాజకీయ అస్త్రంగా, ప్రతిపక్షానికి విమర్శనాస్త్రంగా మారకూడదు. మహిళలకు 33 శాతం ప్రాతినిధ్యం కల్పించడం ఒక ప్రజాస్వామ్య బాధ్యత. రాష్ట్రాల మధ్య రాజకీయ సమతుల్యతను కాపాడటం రాజ్యాంగ బాధ్యత. ఈ రెండింటినీ సమన్వయం చేయగలిగినప్పుడే నిజమైన ప్రజాస్వామ్య విజయం సాధ్యమవుతుంది. పార్లమెంటులో ఎన్ని ఓట్ల మెజారిటీతో బిల్లు ఆమోదం పొందిందన్నది మాత్రమే చరిత్రలో నిలిచిపోదు. ఆ చట్టం దేశ ప్రజాస్వామ్యాన్ని ఎంత బలోపేతం చేసింది, మహిళలకు ఎంతవరకు నిర్ణయాధికారాన్ని అందించింది, సమాఖ్య వ్యవస్థను ఎంతవరకు పరిరక్షించిందన్నదే దాని అసలైన విజయానికి కొలమానం కావాలి.

రాజకీయ రంగంలో కొత్త కుంపట్లు.. ఎవరికి లాభం?

- పరివర్తన రాజనీతి పార్టీతో విజయసాయిరెడ్డి కొత్త ప్రయాణం..
- పార్టీ ఏర్పాటుకు సిద్ధమవుతున్న ఏబీ వెంకటేశ్వరరావు..
- 'ఏకం'తో రాజకీయ రంగ ప్రవేశం చేసిన కేకే సర్వే అధినేత కిరణ్ కొండేటి..
- సంప్రదాయ రాజకీయాలకు ప్రత్యామ్నాయం చూపిస్తారా? ఓటర్లను ఆకర్షించగలరా?



ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి కొత్త రాజకీయ ప్రయోగాలకు తెరలేస్తోంది. ఇప్పటివరకు రెండు ప్రధాన రాజకీయ శక్తుల చుట్టూ తిరిగిన రాష్ట్ర రాజకీయాల్లో కొత్త పార్టీలు, ప్రత్యామ్నాయ వేదికల ఆవిర్భావం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. మాజీ రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ మాజీ కీలక నేత విజయసాయిరెడ్డి 'పరివర్తన రాజనీతి పార్టీ'ని స్థాపించి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం, విజయవాడ మేయర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి ఎదుర్కొన్న మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు సొంత రాజకీయ పార్టీ ఏర్పాటు చేస్తానని ప్రకటించడం, తాజాగా ఎన్నికల సర్వేలతో గుర్తింపు పొందిన కేకే సర్వే అధినేత కిరణ్ కొండేటి 'ఏకం' పేరుతో రాజకీయ వేదికను ప్రకటించడం.. ఈ మూడు పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త చర్చకు కేంద్రబిందువుగా మారాయి.

ఇవి కేవలం ముగ్గురు వ్యక్తులు రాజకీయాల్లోకి రావడానికి చేస్తున్న ప్రయత్నాలుగా మాత్రమే చూడలేం. ప్రస్తుత రాజకీయ వ్యవస్థలో తమకు స్థానం కల్పించుకోవాలని, ప్రజలకు ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను అందించాలని భావిస్తున్న భిన్న నేపథ్యాల వ్యక్తుల ప్రయత్నాలుగా పరిశీలించాలి. ఒకరు రాజకీయ పార్టీలో కీలక బాధ్యతలు నిర్వహించిన అనుభవజ్ఞుడు. మరొకరు ఉన్నత స్థాయి పోలీసు అధికారిగా పనిచేసిన వ్యక్తి. ఇంకొకరు ఎన్నికల సర్వేలు, రాజకీయ వ్యూహాల విశ్లేషణతో గుర్తింపు పొందిన వ్యక్తి. ముగ్గురి నేపథ్యాలు వేరు.. రాజకీయ లక్ష్యాలు, విధానాలు కూడా వేర్వేరు. కానీ సంప్రదాయ రాజకీయాలకు ప్రత్యామ్నాయం చూపాలన్న ప్రయత్నం మాత్రం ఉమ్మడి అంశంగా కనిపిస్తోంది.

పరివర్తన రాజనీతి.. విజయసాయిరెడ్డి కొత్త వ్యూహం! : వైఎస్సార్‌సీపీలో ఒకప్పుడు కీలక నాయకుడిగా, పార్టీ వ్యవస్థాపక నిర్మాణంలో ముఖ్యమైన పాత్ర పోషించిన విజయసాయిరెడ్డి రాజకీయ ప్రయాణం ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. వైఎస్సార్ కుటుంబంతో దశాబ్దాల అనుబంధం, జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా వ్యవహరించిన నేపథ్యం నుంచి బయటకు వచ్చి సొంత రాజకీయ పార్టీని స్థాపించడం ప్రాధాన్యం సంతరించుకుంది. నవంబర్ 11న విజయవాడలో 'పరివర్తన రాజనీతి పార్టీ'ని ప్రకటించిన ఆయన, రాజకీయాల్లో కుటుంబ ఆధిపత్యానికి బదులుగా యువతకు, ప్రతిభావంతులకు నాయకత్వ అవకాశాలు కల్పిస్తామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోటీ చేయాలన్న లక్ష్యాన్ని కూడా వెల్లడించారు.

అయితే ఒకప్పుడు అధికార పార్టీ నిర్మాణంలో కీలకంగా ఉన్న వ్యక్తి ఇప్పుడు అదే రాజకీయ వ్యవస్థకు ప్రత్యామ్నాయమని ప్రకటించడం ప్రజల్లో ఎలాంటి స్పందనను తెచ్చుకుంటుందన్నది ఆసక్తికరం. ఆయనకు ఉన్న రాజకీయ అనుభవం, పరిచయాలు, సంస్థాగత పరిజ్ఞానం ఒకవైపు బలంగా కనిపిస్తున్నా, కొత్త పార్టీగా ప్రజల విశ్వాసాన్ని సంపాదించడం మరో సవాలు. గత రాజకీయ అనుభవం మాత్రమే కొత్త పార్టీకి ప్రజాదరణను తీసుకురాదు. తన గత పాత్రపై ప్రజలకు స్పష్టత ఇవ్వడంతో పాటు భవిష్యత్తు విధానాలపై విశ్వసనీయతను నిరూపించుకోవాల్సి ఉంటుంది.

ఏబీ వెంకటేశ్వరరావు.. అధికార అనుభవం నుంచి రాజకీయ ప్రయాణం! : మరోవైపు మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు రాజకీయ ప్రవేశం కూడా ప్రత్యేకంగా పరిశీలించాల్సిన అంశం. విజయవాడ మేయర్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఆయనకు కాంగ్రెస్, వామపక్షాల మద్దతు లభించింది. అయితే ఎన్నికల్లో ఆయనకు 11,919 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఈ అనుభవం అనంతరం ప్రజలకు ఉపయోగపడే, పారదర్శకమైన రాజకీయ పార్టీని ఏర్పాటు చేస్తానని ప్రకటించారు.

పరిపాలనా వ్యవస్థలో సుదీర్ఘ అనుభవం ఉన్న వ్యక్తిగా ప్రభుత్వ విధానాలు, పాలనా లోపాలు, అధికార యంత్రాంగం పనితీరుపై ఆయనకు అవగాహన ఉంది. ఈ అనుభవాన్ని రాజకీయ విధానాల రూపకల్పనకు ఉపయోగించుకునే అవకాశం ఉంది. అయితే ప్రభుత్వ అధికారిగా పనిచేయడం, ప్రజాప్రతినిధిగా ప్రజల మధ్య పనిచేయడం మధ్య చాలా వ్యత్యాసం ఉంది. రాజకీయాల్లో కేవలం పాలనా అనుభవం సరిపోదు. ప్రజలతో నిరంతర సంబంధాలు, క్షేత్రస్థాయి నాయకత్వం, రాజకీయ సంస్థాగత నిర్మాణం, విస్తృత ప్రజా మద్దతు అవసరం.

మేయర్ ఎన్నికల్లో వచ్చిన ఓట్లను ఆయన రాజకీయ ప్రయాణానికి తుది కొలమానంగా చూడలేం. అదే సమయంలో ఆ ఫలితం కొత్త రాజకీయ వేదికకు ఎదురయ్యే సంస్థాగత సవాళ్లను గుర్తుచేస్తుంది.

'ఏకం'.. సంక్షేమ రాజకీయాలకు ప్రత్యామ్నాయ అజెండా! : ఇప్పుడు కేకే సర్వే అధినేత కిరణ్ కొండేటి 'ఏకం' పేరుతో రాజకీయ వేదికను ప్రకటించడం ఈ కొత్త రాజకీయ పరిణామాలకు మరో కోణాన్ని జోడించింది. 2024 ఎన్నికల అంచనాలతో గుర్తింపు పొందిన ఆయన, రాజకీయాల్లో నేరుగా ప్రవేశిస్తూ ఉచిత పథకాలు, నగదు పంపిణీ హామీలకు బదులుగా నాణ్యమైన విద్య, వైద్యాన్ని ప్రజలకు అందించడమే రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం కావాలని ప్రతిపాదించారు. తొలుత సర్పంచ్ అభ్యర్థులను బరిలోకి దించి ప్రజాభిప్రాయాన్ని పరీక్షించాలన్నది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది.

ఇది ప్రస్తుత సంక్షేమ రాజకీయాలపై ఒక విధానపరమైన చర్చకు అవకాశం కల్పిస్తోంది. ప్రభుత్వాలు నగదు బదిలీ పథకాలకే పరిమితం కాకుండా ప్రభుత్వ విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, మౌలిక వసతులపై దృష్టి పెట్టాలన్నది ఈ వేదిక ప్రతిపాదనలోని ప్రధాన అంశం. అయితే సంక్షేమ పథకాలను పూర్తిగా తిరస్కరించడం పరిష్కారం కాదు. పేదలు, వృద్ధులు, మహిళలు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు అవసరమైన సంక్షేమం కొనసాగిస్తూనే అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ సమతుల్యతను ఏకం తన విధానాల్లో ఎలా ప్రతిబింబిస్తుందో చూడాలి.

వచ్చే ఎన్నికలు.. కొత్త పార్టీలకు అసలైన పరీక్ష! : ఈ మూడు రాజకీయ పరిణామాలను కలిపి చూస్తే రాబోయే ఎన్నికల ప్రాధాన్యం మరింత పెరుగుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలో ఉండగా, వైఎస్సార్‌సీపీ ప్రధాన ప్రతిపక్షంగా కొనసాగుతోంది. మరోవైపు కాంగ్రెస్, వామపక్షాలు తమ రాజకీయ స్థలాన్ని విస్తరించుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త పార్టీల ప్రవేశం రాజకీయ పోటీని మరింత బహుముఖంగా మార్చే అవకాశం ఉంది.

అయితే కొత్త పార్టీలు రావడం వల్ల ఓట్ల చీలిక జరుగుతుందా? ప్రస్తుత పార్టీలకు ప్రత్యామ్నాయంగా ఎదుగుతాయా? నిర్దిష్ట సామాజిక వర్గాలు, యువత, ఉద్యోగులు, రైతులు, మధ్యతరగతి ప్రజలను ఆకర్షిస్తాయా? అన్న ప్రశ్నలకు ఇప్పుడే సమాధానాలు చెప్పలేం. ప్రతి పార్టీ తన విధానాలను, నాయకత్వాన్ని, ప్రజా మద్దతును నిరూపించుకోవాల్సి ఉంటుంది.

తెలంగాణలోనూ 'ఏకం' తన కార్యకలాపాలను విస్తరించాలని ప్రకటించడం ఈ రాజకీయ పరిణామాలకు రెండు తెలుగు రాష్ట్రాల విస్తృతిని జోడిస్తోంది. అయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాజకీయ పరిస్థితులు, సామాజిక సమీకరణాలు, ప్రధాన పార్టీల బలాబలాలు భిన్నంగా ఉన్నాయి. ఒకే రాజకీయ నినాదం రెండు రాష్ట్రాల్లో ఒకే విధమైన ప్రజా స్పందనను పొందుతుందని భావించలేం.

కొత్త పార్టీలు.. కొత్త రాజకీయ సంస్కృతిని తీసుకొస్తాయా? : ప్రజాస్వామ్యంలో కొత్త రాజకీయ శక్తుల ఆవిర్భావం సహజం. అధికార, ప్రతిపక్ష పార్టీలకు భిన్నంగా కొత్త ఆలోచనలు, కొత్త విధానాలు, కొత్త నాయకత్వం ముందుకు రావడం ప్రజాస్వామ్యానికి ఒక అవకాశాన్ని కల్పిస్తుంది. అయితే పార్టీ స్థాపన, జెండా ఆవిష్కరణ, ప్రకటనలు, సమావేశాలు మాత్రమే రాజకీయ మనుగడకు సరిపోవు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు సంస్థాగత నిర్మాణం, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం, ఆర్థిక వనరుల సమీకరణ, సమర్థవంతమైన నాయకత్వం అవసరం.

ముఖ్యంగా కొత్త పార్టీలకు ఒక కీలకమైన సవాలు ఉంది. అవి కేవలం వ్యక్తుల రాజకీయ ఆకాంక్షలకు వేదికలుగా మిగిలిపోకుండా, ప్రజల ఆకాంక్షలకు ప్రతినిధులుగా మారాలి. నాయకత్వం చుట్టూ పార్టీ నిర్మాణం కాకుండా, పార్టీ సిద్ధాంతం చుట్టూ నాయకత్వం అభివృద్ధి చెందాలి. కుటుంబ రాజకీయాలకు ప్రత్యామ్నాయమని చెప్పే పార్టీలు తమలోనూ అంతర్గత ప్రజాస్వామ్యాన్ని పాటించాలి. పారదర్శక పాలన గురించి మాట్లాడే పార్టీలు తమ ఆర్థిక వ్యవహారాలు, అభ్యర్థుల ఎంపిక, నిర్ణయాల ప్రక్రియలోనూ పారదర్శకత చూపాలి.

ఓటరు తీర్పే అంతిమ గీటురాయి! : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొత్త పార్టీల ఆవిర్భావం ప్రస్తుత రాజకీయ శక్తులకు కూడా ఒక ప్రశ్నను సంధిస్తోంది. ప్రజలు ఎందుకు కొత్త వేదికల కోసం ఎదురుచూస్తున్నారు? ప్రస్తుత పార్టీల విధానాల్లో వారికి ఎలాంటి లోపాలు కనిపిస్తున్నాయి? యువతకు తగిన రాజకీయ అవకాశాలు లభిస్తున్నాయా? అభివృద్ధి, సంక్షేమం, ఉపాధి, సామాజిక న్యాయం వంటి అంశాల్లో ప్రజల ఆకాంక్షలు ఎంతవరకు నెరవేరుతున్నాయి? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకడం అన్ని రాజకీయ పార్టీలకు అవసరం.

వచ్చే ఎన్నికలు కేవలం అధికార, ప్రతిపక్షాల మధ్య పోటీగానే కాకుండా కొత్త రాజకీయ ప్రయోగాలు, ప్రత్యామ్నాయ విధానాలు, నాయకత్వాల విశ్వసనీయతకు కూడా పరీక్షగా నిలవనున్నాయి. కొత్త పార్టీలు ఎన్ని వస్తాయన్నది ముఖ్యం కాదు. వాటిలో ఎన్ని ప్రజల మధ్య నిలబడతాయి? ఎన్ని క్షేత్రస్థాయిలో సంస్థాగతంగా ఎదుగుతాయి? ఎన్ని ఎన్నికల తర్వాత కూడా ప్రజా సమస్యలపై పనిచేస్తాయి? అన్నదే అసలైన ప్రశ్న.

ముగ్గురు వ్యక్తులు.. మూడు భిన్న నేపథ్యాలు.. మూడు కొత్త రాజకీయ ప్రయత్నాలు! విజయసాయిరెడ్డి రాజకీయ అనుభవంతో, ఏబీ వెంకటేశ్వరరావు పరిపాలనా నేపథ్యంతో, కిరణ్ కొండేటి ఎన్నికల విశ్లేషణ అనుభవంతో ప్రజల ముందుకు వస్తున్నారు. వీరి రాజకీయ ప్రయాణాలు ఎలాంటి మలుపులు తిరుగుతాయో కాలమే నిర్ణయిస్తుంది. అయితే ఒక విషయం స్పష్టం.. వచ్చే ఎన్నికల నాటికి తెలుగు రాష్ట్రాల్లో కొత్త రాజకీయ సమీకరణాలు, ప్రత్యామ్నాయ వేదికలు, నాయకత్వాలపై చర్చ మరింత విస్తరించనుంది. ప్రజాస్వామ్యంలో కొత్త పార్టీకి తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. కానీ ఆ తలుపుల గుండా అధికారంలోకి వెళ్లే మార్గాన్ని నిర్ణయించేది నాయకుల ప్రకటనలు కాదు.. ప్రజల విశ్వాసం, క్షేత్రస్థాయి పనితీరు, చివరకు ఓటరు తీర్పు మాత్రమే!

రైతుల భూ హక్కులకు రీసర్వేతో భరోసా

- భూముల హద్దులు, విస్తీర్ణంపై స్పష్టతకు అవకాశం
- రీసర్వేలో రైతులందరూ భాగస్వాములు కావాలి
- కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి

కందుకూరు, నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : రైతుల భూ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన సమగ్ర భూముల రీసర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి రైతులందరూ సహకరించాలని కందుకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) కోరారు.రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలోని గఫూర్ నగర్ గ్రామంలో భూముల సమగ్ర రీసర్వేపై నిర్వహించిన గ్రామసభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ..చాలా సంవత్సరాల తర్వాత రాష్ట్రంలో చేపట్టిన భూముల సమగ్ర రీసర్వే రైతులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు.రీసర్వే ద్వారా భూముల హద్దులు,విస్తీర్ణం,సర్వే నంబర్లు,ఉపవిభాగాల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఖచ్చితమైన భూ రికార్డులను రూపొందించేందుకు అవకాశం కలుగుతుం దన్నారు.రీసర్వే పూర్తయితే పొరుగు రైతుల మధ్య భూ హద్దులకు సంబంధించిన వివాదాలు తగ్గడంతో పాటు,రికార్డుల్లో నమోదైన విస్తీర్ణానికి



క్షేత్రస్థాయి కొలతలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను గుర్తించవచ్చని వివరించారు.వారసత్వ భూముల విభజన,భూముల క్రయ విక్రయాలు,బ్యాంకు రుణాల పొందడం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఖచ్చితమైన భూ రికార్డులు ఎంతగానో ఉప యోగపడతాయని పేర్కొన్నారు.డిజిటల్ రికార్డుల రూపకల్పనతో భవిష్యత్ తరాలకు కూడా భూముల వివరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.సర్వే బృందం గ్రామానికి వచ్చినప్పుడు ప్రతి రైతు స్వయంగా లేదా తమ ప్రతినిధుల ద్వారా భూముల వద్ద అందుబాటులో ఉండి వాస్తవ హద్దులను చూపించాలని సూచించారు.పొరుగు రైతులతో సమన్వయం చేసుకుంటూ సర్వే



సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.రీసర్వే కేవలం భూముల కొలతల కార్యక్రమం మాత్రమే కాదని,రైతుల భూ హక్కులకు దీర్ఘకాలిక భద్రత కల్పించే ప్రక్రియ అని స్పష్టం చేశారు.

రైతుల భాగస్వామ్యంతోనే రీసర్వే విజయవంతం

ఈ గ్రామసభలో ఎంపీడీవో గీతారెడ్డి,తహసీల్దార్ వేణుగోపాల్, డీటీ కందుకూరు శేఖర్,వ్యవసాయ అధికారి లావణ్య,డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే రామకాంత్ రెడ్డి,మండల సర్వేయర్ సాయికాంత్,గ్రామ సర్పంచ్ కృష్ణ,ఉపసర్పంచ్ రవికుమార్ రెడ్డి,రైతులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.68 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- చంద్రపురి, గాంధీనగర్ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

జవహర్ నగర్, నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : జవహర్ నగర్ పరిధిలోని కాలనీల అభివృద్ధికి మరో ముందడుగు పడింది. చంద్రపురి కాలనీ డివిజన్‌లో రూ.1.36 కోట్ల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, జవహర్ నగర్ డివిజన్‌లోని గాంధీనగర్ కాలనీలో రూ.32 లక్షల నిధులతో చేపట్టనున్న డ్రైనేజీ, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.1.68 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, కాలనీల్లో నెలకొన్న రోడ్లు, మురుగునీటి సమస్యలను పరిష్కరించడం ప్రజాప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని, చేపట్టిన పనులను



దశలవారీగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. కాలనీల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు.
ఈ కార్యక్రమంలో చంద్రపురి డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షురాలు శాంతి కోటేష్ గౌడ్, డీసీసీ కార్యదర్శి సదానందం, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మాజీ ఉప మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు గొడుగు వేణు, బల్లి శ్రీనివాస్, శ్రీనివాస్ రెడ్డి, సతీష్ గౌడ్, నవీన్, సాయి, మహిళా నాయకులు శ్వేత, అనంతలక్ష్మి, రజిత గోపాల్, లత, సునీత, భాగ్య, వినయ్, గోనె చిట్టిబాబు, రాజు గౌడ్, బూడిద వెంకటేష్, అశోక్ గుప్తా, సాయి కృష్ణ (మిట్టు), భాస్కర్, బబ్లూ ముదిరాజ్, రాహుల్ కదం తదితరులతో పాటు కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియకు ఇంకా ఎంత కాలం

- ఉద్యమకారుల సమస్యలపై సీఎం స్పందించాలి
- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ
- సికింద్రాబాద్లో ఉద్యమ సంఘాల సమాలోచన సమావేశం
- ఉద్యమకారులు గుర్తింపు ప్రక్రియ జాప్యం పై జేఏసీ నేతల ఆగ్రహం

సికింద్రాబాద్, నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమ కారులకు గుర్తింపు కల్పించే ప్రక్రియను ప్రభుత్వం ఇంకా ఎన్నాళ్లు సాగదీస్తుందని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ నాయకులు ప్రశ్నించారు.గురువారం సికింద్రాబాద్ సీతాఫల్‌మండి



లోని మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్‌లో వివిధ ఉద్యమ సంఘాల ఆధ్వర్యంలో సమాలోచన సమావేశం నిర్వహించారు.ఇటీవల మృతి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కు ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు ఘటించారు.తెలంగాణ ఉద్యమకారుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మల్లూరి అనిల్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు సంఘాల అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తెలంగాణ భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణ, ఉద్యమకారుల సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఇప్పటికే పలుమార్లు గుర్తింపు కమిటీ ప్రతినిధులను కలిసి ప్రక్రియను వేగవంతం చేయాలని కోరినప్పటికీ ఎలాంటి పురోగతి లేదని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి పేరుతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇతర వర్గాలకు సమయం కేటాయిస్తున్నప్పటికీ తెలంగాణ కోసం పోరాడిన ఉద్యమకారుల సమస్యలపై స్పందించేందుకు సమయం కేటాయించకపోవడం బాధాకర మన్నారు. ప్రభుత్వం వెంటనే గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి అర్హులైన ఉద్యమకారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో భవిష్యత్తులో ఉద్యమ కార్యాచరణను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

శేఖర్ మాస్టర్ కారుకు ప్రమాదం..వెనుక నుంచి ఢీకొట్టిన లారీ

శంషాబాద్ నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : ప్రముఖ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. హైదరాబాద్ శివార్లలోని శంషాబాద్ సమీపంలో ఇవాళ తెల్లవారుజామున ఈ ఘటన చోటు చేసుకుంది. వెనుక నుంచి వేగంగా వచ్చిన పండ్ల లోడ్ లారీ ఆయన కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు వెనుక భాగం తీవ్రంగా దెబ్బతినగా.. శేఖర్ మాస్టర్‌కు స్వల్ప గాయాలైనట్లు సమాచారం. సినిమా షూటింగ్ ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.వివరాల్లోకి వెళ్తే.. శేఖర్ మాస్టర్ ప్రస్తుతం కాకా సినిమాలోని ఓ స్పెషల్ సాంగ్‌కు కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ పాట చిత్రీకరణ పూర్తయిన అనంతరం ఆయన కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో శంషాబాద్ పరిధిలోని ముచ్చింతల్ సమీపానికి చేరుకోగానే వెనుక నుంచి వేగంగా వచ్చిన పండ్ల లోడ్ లారీ అదుపుతప్పి ఆయన కారును ఢీకొట్టినట్లు తెలుస్తోంది. లారీ బలంగా ఢీకొట్టడంతో కారు వెనుక భాగం తీవ్రంగా దెబ్బతింది.ప్రమాద సమయంలో కారులో శేఖర్ మాస్టర్ ఉండటంతో ఆయనకు గాయాలయ్యాయని తెలుస్తోంది. అయితే గాయాల తీవ్రత ఎంతమేర ఉందనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రమాదం జరిగిన వెంటనే ఆయన ఆరోగ్య పరిస్థితిపై అభిమానులు ఆరా తీస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా తమ అభిమాన కొరియోగ్రాఫర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ సందేశాలు పెడుతున్నారు.



గాంధీనగర్ కాలనీలో రూ.36 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

- అంబేద్కర్ నగర్‌లో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమం



జవహర్‌నగర్, నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో కాలనీ అధ్యక్షుడు నాయకం భాస్కర్ ఆధ్వర్యంలో రూ.36 లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, జవహర్ నగర్ మాజీ మేయర్, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ ప్రారంభించారు.అనంతరం అంబేద్కర్ నగర్‌లో నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో నాయకులు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు అర్హులైన పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహులు యాదవ్, చంద్రపురి కాలనీ డివిజన్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లేపల్లి సదానందు, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు బల్లి శ్రీనివాస్, సత్యం వంశరాజ్, రాష్ట్ర మహిళా నాయకురాలు అనంతలక్ష్మి, రాష్ట్ర నాయకుడు గడ్డం శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు కుతాడి సాయికుమార్, సంగారెడ్డి మనోహర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మాట్ల వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి డీవీఎస్ వెంకటేశ్వర్లు, కోశాధికారి పొలాస కిరణ్ కుమార్, చంద్రపురి కాలనీ డివిజన్ ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్, కోశాధికారి నంగునూరు అశోక్ కుమార్ గుప్తా, మైనారిటీ సెల్ అధ్యక్షుడు రఫిక్, కాలేశా, విజయరాయ్, అబ్బగౌని రాజు యాదవ్, ఆరకల అనిల్ కుమార్, రమేష్, సోమేశ్ చారి, గండి సునీత, చింత విజయ, జూలేక అరుణ, జాన్ ఆనంద్, వెంకటేష్ వంశరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సుంకిరెడ్డి

- దుర్గామాత నిమజ్జనోత్సవ కమిటీకి రూ.1.20 లక్షల ఆర్థిక సహాయం
- హామీ మేరకు చెక్కు అందజేత..కృతజ్ఞతలు తెలిపిన ఉత్సవ కమిటీ సభ్యులు



కడ్తాల్, నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : ఇచ్చిన మాటకు కట్టుబడి దుర్గామాత ఉత్సవ కమిటీకి ఆర్థిక సహాయం అందజేసి సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి తన ఔదార్యాన్ని చాటుకున్నారు.రంగారెడ్డి జిల్లా కడ్తాల్ పట్టణంలో దుర్గామాత మిత్రమండలి ఆధ్వర్యంలో నిర్వహించిన దేవీ నవరాత్రి ఉత్సవాలు,నిమజ్జనోత్సవాల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.1,20,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి నిమజ్జనోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన ఎల్ఈడీ ట్రస్,డీజే,లైటింగ్ ఏర్పాట్ల కోసం ఆర్థిక సహాయం అందిస్తానని ఉత్సవాల సందర్భంగా హామీ ఇచ్చారు.ఉత్సవాలు విజయవంతంగా ముగిసిన అనంతరం ఆ హామీని నిలబెట్టుకుంటూ రూ.1.20 లక్షల చెక్కును దుర్గామాత మిత్రమండలి కమిటీ సభ్యులకు అందజేశారు.ఇచ్చిన హామీ మేరకు ఆర్థిక సహాయం అందించిన రాఘవేందర్ రెడ్డికి దుర్గామాత మిత్రమండలి సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఉత్సవాల నిర్వహణకు సహకరించిన ఆయన సేవాభావాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో దుర్గామాత మిత్రమండలి అధ్యక్షుడు ఎగిరిశెట్టి కరుణాకర్,సభ్యులు బాచిరెడ్డి రవీందర్ రెడ్డి,అశోక్ రెడ్డి,ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రమేష్,రఘు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ మిషన్‌పై సీఎంసీ అధికారులకు శిక్షణ

శేర్లింగంపల్లి, నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : స్వచ్ఛ భారత్ మిషన్ (అర్బన్) 2.0లో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) అధికారులకు గురువారం బంజారాహిల్స్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఏఎస్సీఐ)లో ఒకరోజు సామర్థ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని ఏఎస్సీఐ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎన్. రమేష్ కుమార్, సీఎంసీ కమిషనర్ డాక్టర్ జి. సృజన, ఏఎస్సీఐ డీన్ డాక్టర్ ఎన్. జనార్దన్ రెడ్డి ప్రారంభించారు. పట్టణ పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, మున్సిపల్ సేవల మెరుగుదల, పరిపాలనా సామర్థ్యం, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడంపై శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీఎంసీ జోనల్ కమిషనర్లు, అదనపు కమిషనర్లు, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు, డిప్యూటీ కమిషనర్లు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పట్టణ పారిశుధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు అధికారుల నైపుణ్యాలను పెంపొందించడమే శిక్షణ లక్ష్యమని అధికారులు తెలిపారు.



యాదవుల ఐకమత్యం సమాజ అభివృద్ధికి దోహదం: ఎంపీ ఈటల

- గుండ్లపోచంపల్లిలో అట్టహాసంగా యాదవుల సదరు సమ్మేళనం



మేడ్చల్ నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్‌లో శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదరు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఉనిగొర్ల నర్సింగ్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ ఉత్సవాల్లో దున్నపోతుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యాదవులు సంప్రదాయ ఆటపాటలతో సందడి చేయడంతో వేడుకల ప్రాంగణం ఉత్సాహభరితంగా మారింది. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు మన సమాజానికి ఎంతో ప్రత్యేకమైనవి. తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. యాదవులు ఐకమత్యంతో ముందుకు సాగుతూ సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి. శ్రీకృష్ణుడి బోధనలు, ఆదర్శాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. ఇలాంటి సంప్రదాయ వేడుకలను నిర్వహించడం ద్వారా మన సంస్కృతి, వారసత్వాన్ని కాపాడుకోవచ్చు" అని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో గుండ్లపోచంపల్లి డివిజన్ వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యాదవ సంఘం సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కండ్లకోయ చెరువులో కలుషిత నీరు

- చేపలు మృత్యువాత మత్స్యకారుల ఆందోళన..



మేడ్చల్ నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : మేడ్చల్ సర్కిల్ పరిధిలోని కండ్లకోయ చెరువులోకి కలుషిత నీరు చేరడంతో వందల సంఖ్యలో చేపలు మృత్యువాత పడుతున్నాయి. చెరువుపై ఆధార పడి జీవనోపాధి పొందుతున్న మత్స్యకారులు ఈ పరిణామంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కండ్లకోయ గ్రామంలోని పలు అపార్ట్‌మెంట్లు, హాస్టల్ భవనాల నుంచి వెలువడుతున్న మురుగు నీరు నేరుగా చెరువులో కలుస్తుండటంతో నీరు కలుషితమై చేపలు చనిపోతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. దీంతో మత్స్యకార కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చెరువులోకి మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, నష్టపోయిన మత్స్యకారులకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కందాడి నరేందర్ రెడ్డి, పెంటయ్య, రాజేందర్, శివ పాల్గొన్నారు.

రైల్వే అధికారుల అనుమతి కోసం ఎదురుచూపులు..

- ఇందిరా నెహ్రూ నగర్ వాసుల అవస్థలు ఎప్పటికి తీరేను..



మల్కాజిగిరి, నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : మల్కాజిగిరి నియోజకవర్గం, ఇందిరా నెహ్రూ నగర్ కాలనీకి రాకపోకలు సాగించేందుకు ఉన్న ఏకైక మార్గం రైల్వే పట్టాల మీదుగా ఉండటంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల రైల్వే అధికారులు రైల్వే పట్టాల మరమ్మతు పనులు చేపట్టిన నేపథ్యంలో కాలనీకి వెళ్లే రహదారి పూర్తిగా ధ్వంసమైంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ధ్వంసమైన రహదారిని తిరిగి పునరుద్ధరించాలంటే రైల్వే డివిజనల్ మేనేజర్ (డీఆర్ఎం) అనుమతి తప్పనిసరిగా తీసుకురావాలని రైల్వే అధికారులు స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలో గురువారం సుమారు 20 మంది కాలనీవాసులు కలిసి సీనియర్ సెక్షన్ ఇంజినీర్‌ను సంప్రదించి రహదారి సమస్యను వివరించారు. అయితే డీఆర్ఎం నుంచి అధికారిక అనుమతి తీసుకున్న తర్వాతే రహదారి అభివృద్ధి పనులు చేపడతామని అధికారులు తెలిపారు. గురువారం డీఆర్ఎం అందుబాటులో లేకపోవడంతో సమస్యకు తక్షణ పరిష్కారం లభించలేదు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రైల్వే ఉన్నతాధికారులు వెంటనే స్పందించి అనుమతులు మంజూరు చేయడంతో పాటు రహదారిని పునరుద్ధరించి వాహనాల రాకపోకలకు వీలుగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో కన్నా మల్ల నాగరాజు, మిర్యాల రామచంద్రయ్య, ముంతా బాలరాజు యాదవ్, కొలుపుల కొమురయ్య, శీను యాదవ్, మల్లయ్య, కనకయ్య, జె. రాములు గౌడ్, శంకర్, ఎం. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాల్లో దున్నపోతు దాడి..
క్రాంతి యాదవ్‌కు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి పరామర్శ

- మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరిన మైనంపల్లి..
- అన్ని విధాలా అండగా ఉంటామని హామీ

మల్కాజిగిరి, నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : మల్కాజిగిరి ప్రాంతంలో జరిగిన సదర్ ఉత్సవాల్లో దున్నపోతు దాడి చేయడంతో మీర్జాలగూడకు చెందిన క్రాంతి యాదవ్ గాయపడ్డారు. ప్రస్తుతం ఆయన యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గురువారం



కాంగ్రెస్ నాయకులు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, జంగాల శ్రీరామ్ యాదవ్‌లతో కలిసి యశోద ఆసుపత్రికి వెళ్లి క్రాంతి యాదవ్‌ను, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి క్రాంతి యాదవ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులను కోరారు. ఈ సందర్భంగా క్రాంతి యాదవ్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన మైనంపల్లి హనుమంతరావు, క్రాంతి యాదవ్‌కు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

మియాపూర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులను లెక్కచేయని బిల్డర్!

శేర్లింగంపల్లి, నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : మియాపూర్ సర్కిల్ పరిధిలోని చందానగర్‌లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్లాట్ నంబర్లు 1-24, 1-25లో రెండు భవనాల నిర్మాణ పనులు సాగుతుండగా, మరో భవనంలో కింద ఆసుపత్రి నిర్వహిస్తూ పైన నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇరుకైన రోడ్డులో ఆసుపత్రి నిర్వహణతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో అక్రమ నిర్మాణాన్ని గుర్తించి కూల్చివేతలు చేపట్టినా బిల్డర్ మళ్లీ నిర్మాణాలు కొనసాగిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. మియాపూర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల చర్యలను సైతం లెక్కచేయకుండా నిర్మాణాలు చేపడుతున్న తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గురుకుల క్రీడాపోటీల్లో సెమీఫైనల్, ఫైనల్‌కు చేరిన జట్లు

- రెండో రోజు ఉత్సాహంగా సాగిన హైదరాబాద్ జిల్లా స్థాయి క్రీడోత్సవాలు

శామీర్‌పేట, నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : మహాత్మా జ్యోతిబా ఫూలే బీసీ గురుకుల పాఠశాలలు, కళాశాలల హైదరాబాద్ జిల్లా స్థాయి క్రీడోత్సవాలు రెండో రోజు ఉత్సాహభరితంగా సాగాయి. గురువారం నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో విద్యార్థులు ప్రతిభ క న బ రిచారు. ఖోఖో విభాగంలో హైదరాబాద్, మేడ్చల్, నాంపల్లి, బహదూర్‌పుర జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. కబడ్డీ విభాగంలో హైదరాబాద్, చార్మినార్, ముషీరాబాద్, కార్వాన్ జట్లు తదుపరి దశకు అర్హత సాధించాయి. చెస్ విభాగంలో జూబ్లీహిల్స్, నాంపల్లి జట్లు ఫైనల్‌కు చేరుకోగా, వాలీబాల్‌లో బండ్లగూడ, సనత్‌నగర్ జట్లు తుదిపోరుకు అర్హత సాధించాయి.రెండో రోజు జరిగిన పోటీల్లో విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ, శారీరక విద్యా సంచాలకుడు వెంకటరెడ్డి, వివిధ గురుకుల పాఠశాలల సిబ్బంది, శారీరక విద్యా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





మూడుచింతలపల్లి నుంచి కుషాయిగూడకు అదనపు బస్సులు నడపాలి

- విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగుల ప్రయాణ ఇబ్బందులు తొలగించాలి

శామీర్‌పేట,నవంబరు13 (జర్నలిస్ట్ ఫైల్) : మూడు చింతలపల్లి మున్సిపల్ కేంద్రం నుంచి ఈసీఐఎల్, కుషాయిగూడ ప్రాంతాలకు అదనపు బస్సు సర్వీసులు నడపాలని స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రయాణికులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. ప్రస్తుతం ఈ మార్గంలో పరిమితంగా బస్సులు ఉండటంతో విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.కుషాయిగూడ నుంచి తిమ్మాపూర్‌కు నడిచే రెండు బస్సు సర్వీసులను మూడుచింతలపల్లి వరకు, కుషాయిగూడ నుంచి ఉద్దమర్రికి నడిచే బస్సును లక్ష్మాపూర్ వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మార్పులతో ఆయా ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ జామ్ రవి ప్రత్యేక చొరవ తీసుకొని కుషాయిగూడ డిపో మేనేజర్‌తో చర్చించి బస్సు సర్వీసుల పొడిగింపునకు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

- లాల్‌గడి మలక్‌పేట్‌లో రూ.24 లక్షలతో యూజీడీ పనులు ప్రారంభం

శామీర్‌పేట, నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) : పురపాలక సంఘ పరిధిలోని అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ లక్ష్యమని అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా లాల్‌గడి మలక్‌పేట్ ఆరో వార్డులో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.24 లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ మురుగునీటి పారుదల వ్యవస్థ (యూజీడీ) నిర్మాణ పనులను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శిరీష కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తున్నామని, మురుగునీటి సమస్యల పరిష్కారానికి యూజీడీ నిర్మాణం దోహదపడుతుందని పేర్కొన్నారు. చేపట్టిన పనులను నాణ్యతతో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, స్థానిక కౌన్సిలర్ కైరా గణేష్, కౌన్సిలర్లు గురుకుల దీప సాయికృష్ణ, యెల్లు దీపిక వరప్రసాద్‌రెడ్డి, సరసం వనజ అశోక్‌రెడ్డి, గదె వెంకటేష్, గూడె వెంకటేష్, వడగం యమున శ్యామ్, తలారి మౌనిక బాబు, వంగరి మౌనిక దినేష్, చేడు వనజ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకట్‌రెడ్డి, ఏఈఈ సనా షాహీన్, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లతో పేదల ఇంట సంతోషం.. అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- నూతన గృహాలను ప్రారంభించి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

మిడ్జిల్, నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :

పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరుపేద కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపుతోందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. మిడ్జిల్ మండలం వస్పుల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను గురువారం ఆయన ఘనంగా ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు నూతన రేషన్ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా శాశ్వత గృహ వసతి కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులు నాణ్యతతో కూడిన ఇళ్లను నిర్మించుకోవాలని సూచించారు.ప్రజా ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లతో పాటు రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ ద్వారా పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు మరింత చేరువవుతున్నాయని పేర్కొన్నారు. రేషన్ స్మార్ట్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా, అర్హులైన వారికే అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో వస్పుల గ్రామంలో లబ్ధిదారుల కుటుంబాల్లో ఆనందం నెలకొంది. సొంతింటి కల నెరవేరడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంబంధిత అధికారులు, గ్రామస్తులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



మధిరను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే మా ధ్యేయం

- మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత
- మధిర పట్టణాభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం.
- పారిశుధ్య నిర్వహణకు పెద్దపీట వేస్తూ ప్రత్యేక వాట్సాప్ వ్యవస్థ, స్వచ్ఛ ఏఐ సాంకేతికత అందుబాటులోకి.
- వేసవిలో నీటి ఎద్దడి నివారణకు వైరా నది నుంచి నూతన పైప్‌లైన్‌ల ఏర్పాటు, పార్కుల ఆధునీకరణ.

మధిర, నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :

మధిర పట్టణాన్ని అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా,ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తమ ప్రథమ కర్తవ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత అన్నారు.గురువారం ఆమె అధ్యక్షతన జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశంలో పట్టణాభివృద్ధి,మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పలు కీలక తీర్మానాలకు సభ్యులందరూ ఏకగ్రీవ ఆమోదముద్ర వేశారు.సమావేశం ముగిసిన అనంతరం చైర్‌పర్సన్ సుజాత మాట్లాడారు.మున్సిపాలిటీని ఆర్థికంగా మరింత పటిష్టం చేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలిపారు.ఇందులో భాగంగా పట్టణంలో అసెస్‌మెంట్ కాని ఆస్తులను,ఆన్‌లైన్ కాని అనధికార నల్లా కనెక్షన్లను గుర్తించి క్రమబద్ధీకరించేందుకు ఇంటింటి సర్వేను ముమ్మరం చేసినట్లు వివరించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు పారిశుధ్య రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామన్నారు. బయో మైనింగ్ పనుల వేగవంతం,వ్యర్థాల శుద్ధికి ఆధునిక యంత్రాల సమకూర్పుతో పాటు పారిశుధ్య వాహనాల నిర్వహణపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు చెప్పారు.పౌరుల ఫిర్యాదుల తక్షణ పరిష్కారం కోసం ప్రత్యేక వాట్సాప్ వ్యవస్థను,పారిశుధ్య పనుల పర్యవేక్షణకు అత్యాధునిక స్వచ్ఛ ఏఐ సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నట్లు వెల్లడించారు.రానున్న కాలంలో ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని, పట్టణ ప్రజలకు ఎలాంటి నీటి ఎద్దడి తలెత్తకుండా పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేశామని సామినేని సుజాత పేర్కొన్నారు.బోర్లు మరియు మోటార్ల మరమ్మతు పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సామ్యూల్ పాల్, వైస్ చైర్మన్ కోన ధని కుమార్, కౌన్సిలర్లు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.





భూముల రీసర్వేను వేగవంతం చేయాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి

- మాదాపూర్,వెల్గటూర్ లో రీసర్వే ప్రక్రియ పరిశీలన





నిజామాబాద్, నవంబరు 13 (జర్నలిస్ట్ ఫైల్) :

రైతులు,భూ యజమానుల ప్రయోజనార్థం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.జక్రాన్పల్లి మండలం మాదాపూర్,మెండోరా మండలం వెల్గటూర్ లో కొనసాగుతున్న భూముల రీసర్వే ప్రక్రియను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం అదనపు కలెక్టర్ రాజాగౌడ్ తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ,రోవర్ సహాయంతో సర్వే నిర్వహిస్తున్న తీరును క్షుణ్ణంగా పరిశీలిస్తూ,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా పాటిస్తూ,నిబంధనలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా సర్వే నిర్వహించాలని,భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.రైతులు,పట్టాదార్లకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు.ప్రతిరోజు సగటున 30 ఎకరాల చొప్పున సర్వేను నిర్వహిస్తూ,వేగవంతంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అన్నారు.సర్వే సందర్భంగా క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే,తమ దృష్టికి తేవాలన్నారు.ఈ సర్వే వేగవంతానికి అదనంగా అవసరమైన రోవర్ యంత్రాలను సమకూరుస్తామని అన్నారు.ఈ సర్వే ప్రక్రియ నిర్వహణలో అలసత్వానికి తావిస్తే ఎంతమాత్రం ఉపేక్షించబోమని,నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు,సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.సర్వే చేపట్టే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా ముందస్తు సమాచారం అందించి,వారి సమక్షంలో సర్వే నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.భూమి హద్దుల వివరాల నమోదులో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.గ్రామ హద్దు,ప్రభుత్వ భూమి,పట్టా భూములకు సంబంధించిన పూర్తి వివరాలు రీసర్వే ఆధారంగా పక్కాగా నమోదు చేయాలన్నారు.సర్వే అనంతరం గ్రామ సభలు నిర్వహిస్తూ,ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే వారి నుండి దరఖాస్తులు స్వీకరించి వేగంగా పరిష్కరించాలన్నారు.రీసర్వే విషయంలో రైతులకు,భూ యజమానులకు ఏవైనా సందేహాలు ఉంటే వాటిని నివృత్తి చేయాలని సూచించారు.కలెక్టర్ వెంట ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్,రెవెన్యూ అధికారులు,రైతులు ఉన్నారు.

గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రజా గ్రీవెన్స్



గుంటూరు, నవంబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆదేశాల మేరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో కార్పొరేటర్లు ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి వినతులు, అర్జీలు స్వీకరించారు. కార్పొరేటర్లు గుర్రం ప్రసాద్, బెజ్జం అనిల్, గంటా మౌళిక, తెలుగు మహిళా అధ్యక్షురాలు ముత్తినేని శివలీలలు పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు.ప్రజలు తెలిపిన ప్రతి సమస్యను నమోదు చేసుకుని ఎమ్మెల్యే గళ్ళా మాధవి దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని వారు పేర్కొన్నారు.ప్రజా సమస్యల పరిష్కారానికి ఇలాంటి గ్రీవెన్స్ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని వారు తెలిపారు.

అల్పపీడనం పట్ల అప్రమత్తంగా ఉండాలి

గుంటూరు, నవంబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పట్ల అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వాయవ్య దిశగా పయనించి శనివారం నుస్పష్టమైన అల్పపీడనంగా, ఆదివారం ఉదయానికి అదే ప్రాంతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందన్నారు. తదుపరి ఉత్తర వాయవ్య దిశగా కదులుతూ సోమవారం సాయంత్రానికి మధ్య బంగాళాఖాతంలో తుపానుగా బలపడే అవకాశం ఉందని ఆర్.టి.జి.ఎస్ సూచనలు జారీ చేసిందని చెప్పారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల రీత్యా ప్రజలు ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. పంటలు నష్టపోకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు అందించాలని ఆదేశించారు.

జీఎస్టీ ఆదాయాల పెంపునకు సమన్వయంతో పనిచేయాలి : జాయింట్ కలెక్టర్



గుంటూరు, నవంబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలో జీఎస్టీ ఆదాయాల పెంపునకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి జీఎస్టీ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జీఎస్టీ జాయింట్ కమిషనర్లు గీత, సమావేశం నిర్వహణ ఉద్దేశ్యాలను, జీఎస్టీ ఆదాయాల పెంపునకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. గుంటూరు-1, గుంటూరు-2 సర్కిళ్ల పరిధిలో వస్తున్న జీఎస్టీ ఆదాయాలపై సమావేశంలో సమీక్షించి చర్చించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల శాఖ, మున్సిపల్ శాఖలకు సంబంధించి ప్రతి నెలా చెల్లించే టీడీఎస్ వివరాలను సంబంధిత అధికారులు తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. ఆయా శాఖల పరిధిలోని పన్నుల వసూళ్లు, ఆదాయ వివరాలపై ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ, జీఎస్టీ ఆదాయాల పెంపునకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్ శైలజ, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ జయలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కార్డన్ అండ్ సెర్చ్



మంగళగిరి, నవంబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్): రానున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ముందస్తు భద్రతా చర్యలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా మంగళగిరి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి కాలనీలో శుక్రవారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు నార్త్ డీఎస్పీ కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మంగళగిరి టౌన్, రూరల్ పోలీసు అధికారులు, సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. కాలనీలోని అనుమానాస్పద ప్రాంతాలు, ఇళ్లు, వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని ద్విచక్ర వాహనాలతో పాటు అనుమానాస్పద వాహనాలను గుర్తించి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో సరైన పత్రాలు లేని 35 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా నార్త్ డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రౌడీషీటర్లు, అల్లరకు పాల్పడే అవకాశం ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి బైండోవర్ చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అన్ని వార్డుల్లో ముందస్తు తనిఖీలు, ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహిస్తూ ఎన్నికల భద్రతను పటిష్టం చేస్తున్నట్లు వెల్లడించారు.

ఎన్నికల సమయంలో ప్రజలు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అక్రమ ఆయుధాలు, నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, అనుమానాస్పద కార్యకలాపాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, పోలింగ్‌కు ఆటంకం కలిగించినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ తనిఖీల్లో మంగళగిరి టౌన్ సీఐ వీరాస్వామి, మంగళగిరి రూరల్ సీఐ సీహెచ్. వెంకట్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోర్టులు, పెట్రో కెమికల్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులకు సహకరించండి

- అమరావతిలో ఖతార్ కార్యాలయం ఏర్పాటు చేయండి : సీఎం చంద్రబాబు
- ఏపీలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలిస్తాం... త్వరలో అధికారిక బృందం పర్యటన : ఖతార్ రాయబారి మహ్మద్ హసన్ అల్ జబీర్



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో భారత్‌లో ఖతార్ రాయబారి మహ్మద్ హసన్ జబీర్ అల్ జబీర్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, భవిష్యత్ ప్రాజెక్టులపై ఇరువురు చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు, లాజిస్టిక్స్ పార్కులు, హాస్పిటాలిటీ రంగాల్లో అత్యుత్తమ ప్రాజెక్టులు ఉన్నాయని హసన్ అల్ జబీర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. ఎయిర్‌లైన్స్ రంగంలో ఖతార్ అత్యంత ప్రీమియం సేవలను అందిస్తోందని అన్న పేర్కొనగా... భారత్-ఖతార్ మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని, రాష్ట్రంలో వ్యవసాయం, ఆక్వా కల్చర్‌తో పాటు ఫుడ్ ఇండస్ట్రీలోనూ అత్యుత్తమ నాణ్యతను అందిస్తున్నామని సీఎం వివరించారు. సాంకేతికతను వినియోగించుకుని రాష్ట్రంలో సంస్కరణలు తీసుకొచ్చామని సీఎం తెలిపారు. భారత్‌లో పెట్టుబడులకు ఖతార్ ఆసక్తి చూపడం పట్ల ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల అభివృద్ధి పట్ల తమ విజన్‌ను అభినందించినందుకు రాయబారికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలోని పోర్టులు, పెట్రో కెమికల్ ప్లాంట్లు,

గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులకు ఖతార్ సహకారం అందించాలని కోరారు. ఖతార్ ఎయిర్‌వేస్ కనెక్టివిటీ పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరిస్తుందని చెప్పారు. అమరావతిలో ఖతార్ దేశ కార్యాలయాన్ని ఏర్పాట చేసే అంశాన్ని పరిశీలించాలని రాయబారిని సీఎం చంద్రబాబు కోరారు.

ఖతార్ బృందం త్వరలో ఏపీ పర్యటన : హసన్ అల్ జబీర్ : గతంలో భారత్‌లో ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టేందుకు ఖతార్ ఆసక్తి ప్రకటించిందని రాయబారి మహ్మద్ హసన్ అల్ జబీర్ సీఎం చంద్రబాబుతో అన్నారు. ఏపీలో ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రాజెక్టులు, భవిష్యత్ ప్రణాళికలపై మీర ఇచ్చిన ప్రజెంటేషన్లు అద్భుతంగా ఉన్నాయని సీఎం చంద్రబాబును ప్రశంసించారు. ఖతార్ నుంచి అధికారిక బృందం త్వరలోనే ఏపీలో పర్యటిస్తుందని హామీ ఇచ్చారు. ఇతర దేశాల్లో పనిచేస్తోన్న ఖతార్ కంపెనీలు ఏపీలోనూ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఖతార్ ఎయిర్‌వేస్ కనెక్టివిటీని దేశంలోని వివిధ నగరాలకు పెంచే విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. ఇప్పటికే ముంబైలో విజిట్ ఖతార్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని, అన్ని రాష్ట్రాల్లోనూ ఇటువంటి కార్యాలయాలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తిగా ఉన్నామని రాయబరి వివరించారు.

ఎన్నికల వేళ..సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసుల నిఘా



గుంటూరు, నవంబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్): రానున్న గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ముందస్తు భద్రతా చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా హైపర్ సెన్సిటివ్, సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించి ప్రజలకు భద్రతపై భరోసా కల్పించారు.

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు తుళ్లూరు సబ్ డివిజన్ పరిధిలోని ఫిరంగిపురం మండలంలో గొల్లపాలెం, నుదురుపాడు, పొనుగుపాడు గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. తుళ్లూరు ఎస్‌డీపీఓ మురళీకృష్ణ, ఫిరంగిపురం సీఐ భుజంగారావు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామాల్లోని ప్రధాన వీధులు, కూడళ్లలో కవాతు నిర్వహించారు.

అదేవిధంగా పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కట్టెంపూడి, ఆలూరు గ్రామాల్లోనూ పోలీసులు ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు. పొన్నూరు రూరల్ సీఐ కృష్ణయ్య, ఎస్ఐ శ్రీహరి పోలీసు సిబ్బందితో కలిసి గ్రామాల్లోని ప్రధాన వీధులు, బజార్లలో కవాతు నిర్వహించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు.

ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమస్యాత్మక వ్యక్తులను ముందుగానే గుర్తించి బైండోవర్ చర్యలు చేపడుతున్నామని, పోలింగ్‌కు ఆటంకం కలిగించే అవకాశం ఉన్నవారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు గ్రామాల్లో నిరంతర పోలీసు పర్యవేక్షణ కొనసాగుతుందని, అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.

ఎన్నికల ప్రక్రియ ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో సాగేందుకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని జిల్లా పోలీస్ శాఖ విజ్ఞప్తి చేసింది.

శానిటేషన్‌పై ప్రణాళికాబద్ధంగా పని చేయండి : ఎమ్మెల్యే నసీర్

- కార్పొరేటర్లతో అధికారులు సమన్వయం చేసుకోండి
- ఎక్కడైనా చెత్త కనిపిస్తే సహించేది లేదు
- డ్రైనేజీల్లో సిల్ట్ తీత పనులు చేపట్టండి
- శానిటేషన్ అధికారులు, కార్పొరేటర్ల సమావేశంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు, నవంబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు నగరంలో శానిటేషన్ పై కార్పొరేటర్లతో సమన్వయం చేసుకుంటూ అధికారులు ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు వెళ్లాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, ఆసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ సూచించారు. స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో శుక్రవారం శానిటేషన్ అధికారులు,, కార్పొరేటర్లతో ఎమ్మెల్యే ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తడి చెత్త పొడి చెత్త సేకరించడంలో సిబ్బందికి తగిన సూచనలు ఇవ్వాలని చెప్పారు. చెత్త సేకరణకు అవసరమైన సామగ్రిని ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలన్నారు విడతల వారీగా సిల్ట్‌తీత చేపట్టాలని సూచించారు తుఫాను కారణంగా లోతట్టు ప్రాంతాలలో చాలాచోట్ల నీళ్లు నిలిచాయని, ఇకపై ఇలాంటి సమస్యరాకుండా ప్రణాళికబద్ధంగా పని చేయాలని చెప్పారు నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు ఎప్పటికప్పుడు తమ ప్రాంతాలలో శానిటేషన్ ఎలా ఉందో పరిశీలించుకోవాలని సూచించారు ప్రజల వద్దనుంచి ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ తీసుకోవాలన్నారు ఏదైనా సమస్య తమ దృష్టికి వస్తే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలన్నారు. నియోజకవర్గంలోని పలు డివిజన్లలో చెత్త తరలింపులో జాప్యం, డ్రైనేజీల్లో పూడికతీత పనుల పట్ల ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నించారు. పారిశుద్ధ్య పనుల్లో ఎక్కడా నిర్లక్ష్యం వహించకూడదని, సిబ్బంది సమయపాలన పాటించేలా పర్యవేక్షించాలని శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇన్‌స్పెక్టర్లను ఆదేశించారు. ఇటీవలే కొలువుదీరిన కార్పొరేటర్లు తమ డివిజన్లలోని సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని, అధికారులు కూడా కార్పొరేటర్లతో సమన్వయం చేసుకుంటూ తక్షణమే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ నిర్వహించడం వంటి పనులను వేగవంతం చేయాలని చెప్పారు.

ప్రజల ఆరోగ్యమే పరమావధిగా పనిచేయాలని, ప్రధాన రహదారులతో పాటు అంతర్గత కాలనీల్లోనూ ప్రతిరోజూ చెత్త సేకరణ జరిగేలా చూడాలన్నారు.

అమరావతిలో స్పోర్ట్స్ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు చేయండి

- ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ ఎండీ శాశ్వత్ గోయెంకాతో మంత్రి లోకేశ్ భేటీ



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ ఆధ్వర్యంలో అమరావతిలో స్పోర్ట్స్ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ కోరారు. ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ శాశ్వత్ గోయెంకాతో శుక్రవారం విశాఖపట్నంలో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడంతోపాటు, సంస్థల కార్యకలాపాలను విస్తరించేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు.

ఆర్‌పీఎస్‌జీ గ్రూప్‌నకు చెందిన లగ్జరీ లైఫ్‌స్టైల్ బ్రాండ్ ఎఫ్ఎస్‌పీ డిజైన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా మంగళగిరిలో సోర్సింగ్, తయారీ, డిజైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి ఆహ్వానించారు. గ్రీన్ పవర్ లిమిటెడ్ రెన్యూవబుల్ ఎనర్జీ పోర్ట్‌ఫోలియోను ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించాలని కోరారు. సోలార్, బీఈఎస్ఎస్, గ్రీన్ హైడ్రోజన్ రంగాల్లో రౌండ్ ది క్లాక్ (ఆర్‌టీసీ) గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులను చేపట్టాలని సూచించారు.

విశాఖపట్నం, తిరుపతిలో సంస్థ కార్యకలాపాలను మరింత విస్తరించాలని, ఆర్‌పీఎస్‌జీ అనుబంధ సంస్థ ఫస్ట్ సోర్స్ సొల్యూషన్స్ విజయవాడలో ప్రస్తుతం నిర్వహిస్తున్న కార్యకలాపాలను పెంచాలని కోరారు. విశాఖపట్నం లేదా తిరుపతిలో కొత్త ఐటీ కార్యకలాపాలు, కార్యాలయాల ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలించాలన్నారు.

క్రీడారంగ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించిన మంత్రి లోకేశ్.. ఆర్‌పీఎస్‌జీ ఆధ్వర్యంలో అమరావతిలో స్పోర్ట్స్ ట్రైనింగ్ అకాడమీ ఏర్పాటు చేసి, క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. లక్నో, దర్బన్ సూపర్ జెయింట్స్ వంటి ఫ్రాంచైజీల ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేసేందుకు రాష్ట్రంలోని గ్రామీణ స్థాయి ప్రతిభను గుర్తించాలని కోరారు. ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్)లో స్థానిక జట్టును ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించి, రాష్ట్ర యువతకు ప్రొఫెషనల్ క్రికెట్‌లో అవకాశాలు కల్పించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అసాధారణ ప్రతిభ కలిగిన యువతను గుర్తించి, వారికి స్పాన్సర్‌షిప్ అందించాలని శాశ్వత్ గోయెంకాను కోరారు. గ్రామస్థాయి శిక్షణ నుంచి ప్రొఫెషనల్ స్పోర్ట్స్ ఫ్రాంచైజీల వరకు సమగ్ర కార్యాచరణ రూపొందించేందుకు పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ భాగస్వామ్య నమూనాను పరిశీలించాలని సూచించారు.

ఆర్‌పీఎస్‌జీ గ్రూప్ ఎండీ శాశ్వత్ గోయెంకా మాట్లాడుతూ.. తమ గ్రూప్ సంస్థ ఫస్ట్ సోర్స్ సొల్యూషన్స్ లిమిటెడ్ విజయవాడలోని మేధా ఐటీ టవర్‌లో కార్యాలయాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో రూ. 3,286 కోట్ల పెట్టుబడితో 349.8 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విండ్ ప్రాజెక్టును అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి 2025లో విశాఖపట్నంలో నిర్వహించిన 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించారు. స్పెన్సర్స్ రిటైల్ పేరిట విశాఖపట్నం, విజయవాడ వంటి రాష్ట్రంలోని ప్రధాన పట్టణాల్లో హైపర్ మార్కెట్లు, సూపర్ మార్కెట్ అవుట్‌లెట్లను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏపీ ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించిన పెట్టుబడులు, విస్తరణ అవకాశాలను పరిశీలిస్తామని శాశ్వత్ గోయెంకా పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తాం



- ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేస్తాం
- సీఐఐ సదస్సు ప్రాంగణంలో ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్ ను వీక్షించిన మంత్రి లోకేష్
- ఎస్ఎంఈల ఉత్పత్తులు, ఆవిష్కరణలను ఆసక్తిగా పరిశీలించిన మంత్రి

విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్రంలో పెద్ద పరిశ్రమల స్థాపనతో పాటు ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, ఆ దిశగా ప్రజాప్రభుత్వం చర్యలు చేపడుతుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా రెండో రోజు సదస్సు ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్ ను మంత్రి వీక్షించారు. ఆయా పరిశ్రమల ఉత్పత్తులు, పరికరాలు, నూతన ఆవిష్కరణలను మంత్రి ఆసక్తిగా పరిశీలించారు. ప్రెసిషన్ ఇంజనీరింగ్ అండ్ ఎలక్ట్రికల్, ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్, మెటీరియల్ అండ్ మొబిలిటీ సొల్యూషన్స్, ఆర్టీఐహెచ్ ఇన్నోవేటర్స్ ఏరీనా, అగ్రి-టెక్ అండ్ సర్క్యులర్ ఎకానమీ, ఎస్ హెచ్ జీ అండ్ ఉమెన్-లెడ్ ఎంటర్ ప్రైజ్, ఫార్మా అండ్ మెడ్ టెక్, ఫుడ్ ప్రాసెసింగ్ స్టార్టప్‌లను సందర్శించి నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిర్మిక్ ఇన్సులేటర్స్, స్టేషన్ హైడ్రాలిక్ పవర్ ప్యాక్, ఎడ్యుకేషనల్ రోబోట్, కండక్టివ్ గ్యాస్ కెట్స్ , వేవ్ గైడ్స్, క్వాంటం కంప్యూటింగ్ కాంపోనెంట్స్, మిసైల్ ఎజెక్షన్ మెకానిజం, ప్యాకింగ్ ఐటెమ్స్, ఏసీపీ షీట్స్, లిథియం బ్యాటరీస్, లీబాంగ్ వాటర్ ప్రూఫింగ్ ఉత్పత్తులు, వాయిస్ కమాండ్ ద్వారా పనిచేసే ఏఐ డ్రోన్, హెల్మెట్ శానిటైజింగ్ మెషిన్ వంటి పలు నూతన ఆవిష్కరణలను మంత్రి ఆసక్తిగా పరిశీలించారు. ఆయా ఆవిష్కరణలు, ఉత్పత్తులకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఎకోసిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం : అనంతరం ఔత్సాహిక ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలతో సమావేశమయ్యారు. వారి ఆవిష్కరణలు, ఆదాయం, కల్పించిన ఉద్యోగాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎంఎస్ఎంఈలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తామన్నారు. మీరంతా సొంతకాళ్లపై నిలబడ్డారని, ఇది ఎంతో గర్వకారణమని ప్రశంసించారు. మీరంతా ఎకో సిస్టమ్ క్రియేటర్స్. అభివృద్ధి చెందిన దేశాలను గమనిస్తే.. ఎకో సిస్టమ్ కీలకపాత్ర పోషిస్తోంది. రాష్ట్రంలో కూడా ఎకోసిస్టమ్ అభివృద్ధికి కృషిచేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి లోకేష్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కే.రామ్మోహన్ నాయుడు, ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు ఘనస్వాగతం



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : సీఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన భారత ఉప రాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్‌కు గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర బొబ్బిలి కళాకారులు తయారు చేసిన వీణను మంత్రి లోకేష్ ఉప రాష్ట్రపతికి బహుకరించారు. ఉప రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు ఉన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

9.24 లక్షల బీసీ కుటుంబాలకు సౌర విద్యుత్ దిశగా ఏపీ అడుగులు



- రూ.5,544 కోట్ల కేంద్ర ఆర్థిక సాయానికి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి
- 'పీఎం సూర్య ఘర్' బీసీలకు వర్తింపచేయాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ
- రూ.1,848 కోట్ల సబ్సిడీని భరించనున్న రాష్ట్ర ప్రభుత్వం

విశాఖపట్నం, నవంబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్‌లోని 9,24,069 బీసీ కుటుంబాలకు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ప్రయోజనాలను విస్తరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సీఐఐ భాగస్వామ్య సదస్సులో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ సమర్పించారు. తొలి విడతలో సుమారు 1,848 మెగావాట్ల రూఫ్‌టాప్ సోలార్ సామర్థ్యాన్ని ఏర్పాటు చేయదలిచినట్టు సీఎం తెలిపారు. ప్రతి అర్హులైన బీసీ కుటుంబానికి కేంద్ర ఆర్థిక సహాయానికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల సబ్సిడీ అందించనుందని వెల్లడించారు.

ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.5,544 కోట్ల కేంద్ర ఆర్థిక సహాయం, రూ.1,848 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ సహాయం అవసరమవుతాయని వివరించారు. మిగిలిన ప్రాజెక్టు వ్యయాన్ని సంస్థాగత రుణాల ద్వారా సమీకరించాలని ప్రతిపాదించినట్లు పేర్కొన్నారు. దీనివల్ల లబ్ధిదారులపై ముందస్తు ఆర్థిక భారం పడకుండా సౌర విద్యుత్ సదుపాయం కల్పించవచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదికలను ఈ ఏడాది సెప్టెంబర్ 8న కేంద్రానికి సమర్పించినట్లు సీఎం వెల్లడించారు. వాటికి ఆమోదం తెలుపుతూ 9,24,069 బీసీ కుటుంబాలకు పథకం వర్తింపజేయాలని, దీనికి సంబంధించి కేంద్ర ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.

రాష్ట్రంలో ఇప్పటికే 4,56,235 గృహాలకు రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేశామని, ఈ ఏడాది అక్టోబర్ 13 నాటికి ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో నాలుగో స్థానంలో ఉందని ముఖ్యమంత్రి తన లేఖలో పేర్కొన్నారు. తాజా ప్రతిపాదన ఆమోదం పొందితే రాష్ట్రంలో పునరుత్పాదక ఇంధన వినియోగం మరింత విస్తరించడంతో పాటు బీసీ కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.

పారిశ్రామికవేత్తలకు ఫోన్ కాల్ దూరంలో రాష్ట్ర ప్రభుత్వం

విశాఖపట్నం, నవంబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్): ఆంధ్రప్రదేశ్ లో పారిశ్రామిక వేత్తలకు ఒక్క ఫోన్ కాల్ దూరంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. వేగంగా అనుమతులివ్వడానికి యంత్రాంగం పూర్తిగా సహకారం అందిస్తుందని వెల్లడించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సులో భాగంగా ఆర్పీఎస్ జీ గ్రూప్ ఎండీ శాశ్వత్ గోయెంకా ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందడానికి లీడర్షిప్ బ్యాండ్ విడ్త్ కీలకమని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ, ఐటీ సేవలు, క్రీడలు, వస్త్రాలు, ఫ్యాషన్ రంగాల్లో పెట్టుబడులకు విస్తృతమైన అవకాశాలు ఉన్నట్టు వివరించారు. పుర్వా గ్రీన్ పవర్ ద్వారా రాష్ట్రంలో ఇప్పటికే 349.8 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టు, సుమారు రూ.3,286 కోట్ల పెట్టుబడులు పెడుతున్న నేపథ్యంలో... సౌర విద్యుత్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ , గ్రీన్ హైడ్రోజన్ వంటి రంగాల్లో అదనపు పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి వివరించారు. ప్రస్తుతం విజయవాడలోని మేధా ఐటీ టవర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆర్‌పీఎస్‌జీ గ్రూప్‌కు చెందిన ఫస్ట్‌సోర్స్ సంస్థను విశాఖపట్నం, తిరుపతికి విస్తరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందిస్తూనే సామాజిక బాధ్యతగా పీ4 అనే ప్రతిష్టాత్మక కార్యక్రమం చేపట్టామని.. పేదలకు చేయూత అందించేందుకు ముందుకు రావాలని ఆర్పీఎస్జీ గ్రూప్ ను సీఎం కోరారు.

ఏపీలో అందే సహకారం ఇంకెక్కడా లేదు : శాశ్వత్ గోయెంకా

పారిశ్రామిక వేత్తలకు, పెట్టుబడిదారులకు ఏపీలో అందుతున్న సహకారం దేశంలో ఇంకెక్కడా లేదని.. ఈ అంశంలో ఏపీ రోల్ మోడల్ అని ఆర్పీఎస్జీ గ్రూప్ ఎండీ శాశ్వత్ గోయెంకా ముఖ్యమంత్రితో అన్నారు. రాష్ట్ర వనరులు, పెట్టుబడి అవకాశాలపై సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా ముఖ్యమంత్రి ఇచ్చిన ప్రజెంటేషన్ అద్భుతంగా ఉందని ఆయన ప్రశంసించారు. ఏపీలో పెట్టుబడులకు, తమ కార్యకలాపాల విస్తరణకు సిద్ధంగా ఉన్నామని గోయెంకా వివరించారు.

జీజీహెచ్‌కు రూ.47 లక్షల విలువైన ఆర్ఓ వాటర్ ప్లాంట్లు విరాళం



- దివిస్ ల్యాబొరేటరీస్ సామాజిక బాధ్యతలో భాగంగా ఏర్పాటు

గుంటూరు, నవంబర్ 13, (జర్నలిస్ట్ ఫైల్): గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)కు దివిస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్ సంస్థ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా రూ.47 లక్షల విలువైన 15 ఆర్ఓ వాటర్ ప్లాంట్లను విరాళంగా అందించింది. వీటిలో గంటకు 500 లీటర్ల సామర్థ్యం కలిగిన మూడు ప్లాంట్లు, గంటకు 100 లీటర్ల సామర్థ్యం కలిగిన 12 ప్లాంట్లు ఉన్నాయి.

శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ దుర్గా ప్రసాద్ ఈ వాటర్ ప్లాంట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులు, వైద్యులు, సిబ్బందికి స్వచ్ఛమైన తాగునీటిని అందించడంలో ఈ ప్లాంట్లు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రజారోగ్య పరిరక్షణకు దివిస్ ల్యాబొరేటరీస్ సంస్థ అందించిన సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓ వెంకటేశ్వరరావు, హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆసుపత్రి ఫెసిలిటీ మేనేజర్ సాంబశివరావు, దివిస్ సంస్థ ప్రతినిధి ఎస్. సాయి కృష్ణ శ్రీనివాసరావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి గేట్ వే భోగాపురం ఎయిర్‌పోర్ట్

- యువత రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉంది
- ఔత్సాహికుల ఆలోచనలను ఆచరణలో తేవడమే బ్రాండ్ ఆంధ్ర ప్రత్యేకత
- విశాఖలో సినిమా, క్రియేటర్ ఎకానమీ అభివృద్ధికి సహకారం అందిస్తాం
- నటుడు రానా దగ్గుబాటితో పాడ్‌కాస్ట్‌లో మంత్రి నారా లోకేష్



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : విశాఖ నగరం రాష్ట్రానికి ప్రవేశ ద్వారం అయితే, భోగాపురం విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి గేట్ వే లాంటిదని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. విశాఖలో 31వ సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ లో 'ది పవర్ ఆఫ్ పాసిబిలిటీ: బిల్డింగ్ పార్ట్‌నర్‌షిప్స్, క్రియేటింగ్ ది ఫ్యూచర్' అనే అంశంపై ప్రముఖ సినీనటుడు రానా దగ్గుబాటి నిర్వహించిన పాడ్ కాస్ట్ కు మంత్రి లోకేష్ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... భోగాపురం ఎయిర్ పోర్టు హైదరాబాద్ విమానాశ్రయం కంటే పెద్దదిగా ఎదిగిన రోజే తనకు నిజమైన సంతృప్తి కలుగుతుందని అన్నారు. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇలాంటి పెద్ద లక్ష్యాలు కీలకమని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడుల అవకాశాలు, బ్రాండ్ ఆంధ్ర, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, పర్యాటక అభివృద్ధి, సినిమా పరిశ్రమ, క్రియేటర్ ఎకానమీ, యువతకు ఉపాధి-వ్యాపార అవకాశాలు తదితర అంశాలపై రానా అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ సూటిగా సమాధానాలిచ్చారు.

రాష్ట్రాభివృద్ధిపై స్పష్టమైన రోడ్ మ్యాప్ : రాబోయే రెండు దశాబ్దాల్లో రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలనే దానిపై ప్రభుత్వానికి స్పష్టమైన రోడ్ మ్యాప్ ఉంది. విశాఖను దేశానికి ఆర్థిక శక్తి కేంద్రంగా తీర్చిదిద్దాలన్న నమ్మకంతో పనిచేస్తున్నాం. క్వాంటం కంప్యూటింగ్ ప్రాజెక్టును ఉదాహరణగా వివరిస్తూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ఆలోచనను ముందుకు తీసుకొచ్చి, నిపుణులు, ప్రపంచ స్థాయి సంస్థలను ఒకచోట చేర్చి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఆ ప్రయత్నంలో భాగంగా అమరావతిలో భారతదేశంలోనే తొలి 156 క్యూబిట్ క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేయబోతున్నాం.

పర్యాటక రంగంలో అపారమైన అవకాశాలు : విశాఖపట్నంలో ప్రస్తుతం సుమారు 17 స్టార్ హోటళ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అయితే సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ లాంటి భారీ అంతర్జాతీయ కార్యక్రమాలు నిర్వహించాలంటే మరింత పెద్ద స్థాయిలో ఆతిథ్య రంగ మౌలిక సదుపాయాలు అవసరం. ఆలయ పర్యాటకం, బ్లూ ఫ్లాగ్ బీచ్‌లు, అరకు వంటి ప్రాంతాలను అంతర్జాతీయ స్థాయిలో ప్రమోట్ చేయాల్సి ఉంది. అరకు లోయలో మారథాన్ నిర్వహణకు మహీంద్రా సంస్థతో చర్చలు జరుపుతున్నాం. చంద్రబాబు నాయుడు అరకు కాఫీని ప్రపంచ బ్రాండ్‌గా తీర్చిదిద్దిన విధానం అద్భుతం. మన ప్రాంతీయ ప్రత్యేకతలపై మనకు నమ్మకం ఉండాలి, వాటికి తగిన గుర్తింపు తీసుకొచ్చేలా ఆ బ్రాండ్ ను ప్రమోట్ చేయాలి.

సినిమా పరిశ్రమ మద్రాసు నుంచి హైదరాబాద్‌కు మారి అక్కడ స్థిరపడినట్టే, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందాలంటే ఏం చేయాలన్న రానా ప్రశ్నకు లోకేశ్ సమాధానమిస్తూ.. క్రియేటర్ ఎకానమీ భవిష్యత్తులో అతిపెద్ద అవకాశాల్లో ఒకటి. సినిమాలు, యూట్యూబ్, గేమింగ్ అన్నీ ఇందులో భాగమే. నా కుమారుడు దేవాన్ష్‌కు కూడా సొంత యూట్యూబ్ ఛానల్ ఉంది. రాష్ట్రంలోని పిల్లలు, కళాశాల విద్యార్థుల్లోనూ ఇలాంటి సృజనాత్మకత ఉంది, చేతిలో ఉన్న ఫోన్‌తోనే వీడియోలు రూపొందించే టెక్నాలజీ ఇప్పుడు అందుబాటులో ఉంది. హైదరాబాద్‌లో నిర్మాతలు, దర్శకులకు స్థలాలు కేటాయించి స్టూడియోలు నిర్మించుకునేలా ప్రోత్సహించడంతో షూటింగ్ నుంచి పోస్ట్ ప్రొడక్షన్ వరకు అవసరమైన సదుపాయాలు ఏర్పడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ సినిమా నిర్మాణానికి అవసరమైన అన్ని సదుపాయాలు ఒకేచోట అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వం నుంచి సహకారం, పరిశ్రమ నుంచి చొరవ ఉంటే విశాఖలోనూ సినిమా పరిశ్రమకు మంచి అవకాశాలు సృష్టించవచ్చని రానా చెప్పారు. దీనిపై లోకేశ్ స్పందిస్తూ.. రానా ఇందుకు ఈ బాధ్యత తీసుకోవాలని, సినిమా, గేమింగ్ రంగాల్లో ఆయనకున్న అనుభవాన్ని ఉపయోగించి ఆంధ్రప్రదేశ్‌లో క్రియేటర్లకు అవసరమైన సదుపాయాలపై ఉమ్మడి ప్రణాళిక రూపొందిద్దామని ప్రతిపాదించారు. ఇందుకు రానా స్పందిస్తూ...వైజాగ్‌లో సినిమా రంగంతో పాటు ఇతర క్రియేటివ్ రంగాల వారికి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తానని ప్రకటించారు. దీనిపై బ్లూప్రింట్ ను సోమవారం ఉదయానికల్లా సిద్ధం చేస్తానని రానా చెప్పగా, అదే 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అని లోకేశ్ చమత్కరించారు.

విశాఖలో ఐటీ, డేటా సెంటర్లు, హాస్పిటాలిటీ రంగాల్లో పెట్టుబడులు పెరుగుతున్నాయి. 58కి పైగా దేశాల ప్రతినిధులు, 15 మంది విదేశీ మంత్రులు ఈ భాగస్వామ్య సదస్సుకు హాజరయ్యారు. రష్యా, జపాన్, యూరప్ తదితర ప్రాంతాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాం. ఎంఎస్ఎంఈ ఎగ్జిబిషన్‌లో ఒక సంస్థ భారీ యంత్ర పరికరాల తయారీతో పాటు క్వాంటం కంప్యూటింగ్‌కు అవసరమైన విడిభాగాలను కూడా తయారు చేస్తోంది. ఇది రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక ప్రతిభకు నిదర్శనం. పెట్టుబడుల ఒప్పందాలు, ఉద్యోగాల కల్పన ఒక లక్ష్యమైతే.. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే మా ప్రధాన ధ్యేయం.

ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలను ఉద్దేశించి మంత్రి లోకేష్ మాట్లాడుతూ...ముందుగా మనపై మనకు నమ్మకం ఉండాలి. ప్రతికూల అభిప్రాయాలను పట్టించుకోకుండా లక్ష్యం వైపు సాగాలి. కొత్త ఆలోచనలను మొదట్లో సమాజం వ్యతిరేకించవచ్చు. అయితే మారేకొద్దీ సానుకూలత లభిస్తుంది. వైఫల్యాన్ని ఎదుగుదలలో భాగంగా స్వీకరించాలి. వైఫల్యం ఎదురైతే సమాజం ఏమనుకుంటుందోనన్న భయాన్ని అధిగమించాలి. ఫీూ×ూ అంటే 'ఫీఱతీరా్‌వఎజు్ ×అ ామ్షుతీఅఱఅస్త్ర'. ప్రతి ప్రయత్నం నుంచి నేర్చుకుంటూ మానసికంగా దృఢంగా ఎదగాలి. ఈ విషయంలో చంద్రబాబు గారిని యువత ఆదర్శంగా తీసుకోవాలి. పాతికేళ్ల వయసులో ఎమ్మెల్యే కావాలని చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకుని అనుకున్నది సాధించారు. హెరిటేజ్ ఫుడ్స్ ప్రారంభానికి ముందు ఆయన చేసిన మూడు వ్యాపార ప్రయత్నాలు విఫలమైనప్పటికీ వెనక్కి తగ్గలేదు, స్వయంగా నిలదొక్కుకుని వ్యాపారాన్ని నిర్మించాలన్న లక్ష్యాన్ని వదులుకోలేదు. అదే పట్టుదలను రాజకీయాల్లోనూ కొనసాగించారు. లక్ష్యాన్ని సాధించాలనే తపన, కష్టాలను అధిగమించే పట్టుదల ఉండాలన్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి. ప్రస్తుతం రాజకీయాల్లో యవతకు మంచి అవకాశాలున్నాయి. విశాఖ మేయర్‌తో పాటు పలువురు యువ మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు బాధ్యతలు ఇటీవల ఎన్నికయ్యారు. 25 మంది మంత్రుల్లో 17 మంది యువకులే. విదేశాల నుంచి తిరిగొచ్చి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన కొండపల్లి శ్రీనివాస్ ఇందుకు ఉదాహరణ. వ్యవస్థలో లోపాలున్నాయని విమర్శించడం కాదు, వాటికి పరిష్కారాలు చూపించే ప్రక్రియలో యువత భాగస్వాములు కావాలి. సమస్య పరిష్కారమయ్యే వరకు సంబంధిత అధికారులు, సంస్థలు, ప్రజాప్రతినిధులను కలుస్తూ పట్టుదలతో పనిచేయాలి. పెద్ద కలలు కనడంతో పాటు వాటిని సాధించేందుకు ప్రణాళికలు రూపొందించడం, ఉమ్మడి లక్ష్యాల కోసం కలిసి పనిచేయడం ద్వారా సమాజంలో మార్పు సాధ్యమవుతుంది.

సినిమా, సంగీతం, యానిమేషన్, గేమింగ్ వంటి రంగాల్లో యువతకు శిక్షణ అందించేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. సంగీత దర్శకులు, సినిమా రంగంలోని అనుభవజ్ఞులతో కలిసి యువతకు శిక్షణ కార్యక్రమాలు రూపొందిస్తాం. సంగీత శిక్షణ కోసం థమన్‌తో కలిసి పనిచేసే అంశాన్ని పరిశీలిస్తున్నాం. తిరుపతిలోనూ ఇందుకోసం ఒక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ను ఏర్పాటు చేసే ఆలోచన ఉంది. దర్శకత్వం, సినిమాటోగ్రఫీ సహా వివిధ విభాగాల్లో నిపుణుల అనుభవాన్ని యువతకు అందించాలన్నది మా ఆలోచన. దీనికి కృత్రిమ మేధస్సు (ూ×) వంటి ఆధునిక సాంకేతికతను జోడిస్తాం. తద్వారా వినోద రంగంలో కొత్త అవకాశాలను సృష్టిస్తాం. యువతలో ఏదో ఒకటి సాధించాలనే బలమైన తపన ఉండాలి, అదే మిమ్మల్ని ముందుకు నడిపిస్తుందని మంత్రి లోకేష్ అన్నారు.

రాబోయే ఏడాదిలో విశాఖపట్నంలో తమ సంస్థ తరఫున సినీ నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభమయ్యేలా కృషిచేస్తానని నటుడు రానా చెప్పారు. విశాఖపట్నం సిటీ ఆఫ్ డెస్టినీ, ఈ నగరానికి ప్రత్యేకమైన ఆకర్షణ ఉందని పేర్కొంటూ.. ఎపి ప్రభుత్వంతో కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నానని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం కలిగిన ప్రాంతాలతో పాటు ప్రపంచానికి ఇంకా పూర్తిగా పరిచయం కాని ఎన్నో అందమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వాటిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేలా ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా మా ప్రయత్నాలను కొనసాగిస్తాం.

తెలుగు ప్రేక్షకులు ఇతర భాషలు, దేశాల సినిమాలను కూడా ఆదరిస్తారు. భారతీయ వినోద పరిశ్రమ ఆదాయంలో తెలుగు ప్రేక్షకుల వాటా దాదాపు 70 శాతంగా ఉందని, భారత జనాభాలో తెలుగు ప్రజలు దాదాపు పదో వంతు మాత్రమే ఉన్నప్పటికీ ఈ స్థాయిలో ఆదరణ ఉండటం మన ప్రత్యేకత. కొరియా, జపాన్ తదితర దేశాల సినిమాలు, సంస్కృతికి ఆంధ్రప్రదేశ్ స్వాగతం పలుకుతోంది. తెలుగు రాష్ట్రాల ద్వారా దాదాపు 100 కోట్ల మంది భారతీయ ప్రేక్షకులకు చేరువయ్యే అవకాశం ఉంది. బాహుబలి సినిమాను దేశవ్యాప్తంగా పరిచయం చేసినట్టే, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గాథను ప్రపంచానికి చాటాల్సిన అవసరం ఉందని రానా పేర్కొన్నారు.

రాయలసీమకు అంతర్జాతీయ పారిశ్రామిక గుర్తింపు

అమరావతి, నవంబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్): రాయలసీమ పారిశ్రామిక అభివృద్ధికి కియా రెండో ప్లాంట్ ఏర్పాటు కీలక మైలురాయిగా నిలవనుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో సుమారు రూ.17 వేల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ ప్లాంట్ ద్వారా దాదాపు 12 వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన వివరించారు. కియా తొలి ప్లాంట్‌తో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రపంచ పారిశ్రామిక పటంలో గుర్తింపు పొందిందని, రెండో ప్లాంట్ ఏర్పాటుతో దేశంలోనే ప్రముఖ వాహన తయారీ కేంద్రంగా రాయలసీమ ఎదిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కొత్త పెట్టుబడులు, పారిశ్రామిక ఒప్పందాలు ఈ ప్రాంత అభివృద్ధికి మరింత ఊతమిస్తాయని ఆశాభావం వ్యక్తం



చేశారు. విశాఖపట్నంలో నిర్వహించిన పారిశ్రామిక భాగస్వామ్య సదస్సులో రాష్ట్ర ఆరోగ్య రంగానికి సంబంధించి సుమారు రూ.4 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదరడం సంతోషకరమని మంత్రి తెలిపారు. కిమ్స్ ఆసుపత్రి, మంగళగిరి ఎయిమ్స్, పీవీఎస్ రామ్మోహన్ హెల్త్ కేర్ ఇండియా, ఇన్ఫినిట్ లివరలయన్స్ సహా పలు సంస్థల పెట్టుబడులతో దాదాపు 22 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కలగనున్నాయని వెల్లడించారు.

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, పొంగూరు నారాయణ సమక్షంలో ఈ ఒప్పందాలు కుదరడం రాష్ట్రానికి శుభపరిణామమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం పారిశ్రామికంగానే కాకుండా వైద్య రంగంలోనూ పురోగమిస్తోందన్నారు.

ఈ పెట్టుబడులతో ప్రపంచస్థాయి వైద్య మౌలిక సదుపాయాలు రాష్ట్రంలో అందుబాటులోకి వస్తాయని, అత్యాధునిక వైద్య సేవల కోసం పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రజలకు స్థానికంగానే మెరుగైన చికిత్స అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి వివరించారు.

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి లోకేష్ ఘనస్వాగతం



విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్) : సిఐఐ 31వ భాగస్వామ్య సదస్సు ముగింపు వేడుకల్లో పాల్గొనేందుకు విశాఖపట్నం విచ్చేసిన కేంద్ర విద్య, వినియోగదారుల వ్యవహారాలు, పౌర సరఫరాల శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషికి రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఘన స్వాగతం పలికారు. రెండురోజుల సమ్మిట్ ను విజయవంతంగా నిర్వహించడమేగాక భారీఎత్తున పెట్టుబడులు సాధించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, మంత్రి లోకేష్ చొరవను జోషి అభినందించారు. కేంద్రమంత్రికి స్వాగతం పలికిన వారిలో రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవికుమార్, విశాఖ ఎంపి ముతుకుమిల్లి భరత్ తదితరులు ఉన్నారు.

భారతదేశ పర్యాటక వైవిధ్యమంతా ఏపీలోనే..

- టూరిజం పెట్టుబడులకు ఇదే సరైన సమయం.. పెట్టుబడులకు పూర్తి రక్షణ: మంత్రి దుర్గేష్
- రూ.7,287 కోట్లతో 62 పర్యాటక ప్రాజెక్టులు.. 46,853 మందికి ఉపాధి అవకాశాలు



విశాఖపట్నం, నవంబర్ 13 (జర్నలిస్ట్ ఫైల్): భారతదేశంలోని ప్రకృతి, సంస్కృతి, ఆధ్యాత్మిక, చారిత్రక పర్యాటక వైవిధ్యాన్ని ఒకేచోట చూడాలంటే ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిందేనని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. భవిష్యత్తు పర్యాటక రంగానిదేనని, ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయమని పేర్కొన్నారు. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు రెండో రోజు పర్యాటక రంగంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.

రాష్ట్రంలో పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు ప్రభుత్వం పూర్తి భరోసా కల్పిస్తుందని, పెట్టుబడుల రక్షణతో పాటు అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తుందని తెలిపారు. ప్రపంచ పర్యాటక పటంలో ఆంధ్రప్రదేశ్‌ను ప్రముఖ గమ్యస్థానంగా నిలిపేందుకు పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇతర ప్రాంతాల్లో పర్యాటకులకు అనుభవాలు, జ్ఞాపకాలు మాత్రమే మిగిలితే.. ఏపీలో ప్రజల ఆప్యాయత, ఆతిథ్యం కూడా అదనంగా లభిస్తాయని అన్నారు.

సదస్సు రెండో రోజు పర్యాటక రంగానికి సంబంధించి రూ.860 కోట్ల విలువైన 10 అవగాహన ఒప్పందాలు, రూ.336 కోట్ల విలువైన రెండు ప్రాజెక్టులకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వుల మార్పిడి జరిగింది. కుప్పం, కర్నూలు, విజయనగరం, రాజమహేంద్రవరం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో హోటళ్లు, రిసార్టులు, కన్వెన్షన్ కేంద్రాలు, ఇతర పర్యాటక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఈ ఒప్పందాలు కుదిరాయి. తిరుపతిలో ఆర్‌కే2 ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, దైవిక్ హోటల్స్ సంస్థలతోనూ ప్రభుత్వ ఉత్తర్వుల మార్పిడి జరిగింది.

పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం వల్ల పరిశ్రమలకు వర్తించే రాయితీలు ఈ రంగంలోని పెట్టుబడిదారులకు అందుబాటులోకి వచ్చాయని మంత్రి వివరించారు. గత రెండున్నరేళ్లలో దేశీయ, విదేశీ పెట్టుబడుల ద్వారా సుమారు రూ.20 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని తెలిపారు. పెట్టుబడుల మొత్తం కంటే వాటి ద్వారా స్థానిక నిరుద్యోగ యువత, మహిళలకు ఎన్ని ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నదే ప్రభుత్వానికి ముఖ్యమని స్పష్టం చేశారు.

రాష్ట్రంలోని 1,053 కిలోమీటర్ల సముద్రతీరం, అరకు లోయ, లంబసింగి, హార్సిలీహిల్స్, గండికోట, కోనసీమ, గోదావరి, కృష్ణా నదీ తీరాలు, బౌద్ధ క్షేత్రాలు పర్యాటక అభివృద్ధికి అపార అవకాశాలను కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. అటవీ, గిరిజన ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయడంతో పాటు స్థానిక ప్రజలకు జీవనోపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హస్తకళలు, స్థానిక వంటకాలు, పర్యాటక గైడ్ల సేవల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆదాయ అవకాశాలు పెరగాలని ఆకాంక్షించారు.

రకు కాఫీ, కలంకారీ, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకలని మంత్రి పేర్కొన్నారు. అరకు, లంబసింగి, హార్సిలీహిల్స్‌తో పాటు సముద్రతీర ప్రాంతాల్లో యోగా, ఆయుర్వేద ఆధారిత వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుకు విదేశీ పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించారు. 'అథెంటిసిటీ, హ్యూమన్ వార్మ్త్, అతిథి దేవోభవ' సూత్రాలతో, ప్రపంచ ప్రమాణాలకు స్థానిక సంస్కృతిని జోడించి సుస్థిర పర్యాటకాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు.

విశాఖపట్నం, కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతిలో నిర్వహించిన ఐదు ప్రాంతీయ సదస్సుల ద్వారా 50 ప్రాజెక్టులకు, సీఐఐ సదస్సు ద్వారా మరో 12 ప్రాజెక్టులకు ఒప్పందాలు కుదిరాయని మంత్రి తెలిపారు. మొత్తంగా 62 ప్రాజెక్టుల ద్వారా రూ.7,287.30 కోట్ల పెట్టుబడులు రానున్నాయని, వీటిలో సీఐఐ సదస్సు వాటా రూ.1,114.92 కోట్లని వివరించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 5,000కు పైగా హోటల్ గదులు అందుబాటులోకి రావడంతో పాటు 46,853 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కలగనున్నాయని వెల్లడించారు.

స్థానిక సమాజాల అభివృద్ధికి ప్రతి ప్రాజెక్టులోనూ ప్రాధాన్యం ఇస్తామని, పర్యాటక అభివృద్ధి ఫలాలు క్షేత్రస్థాయిలోని సామాన్య ప్రజలకు చేరినప్పుడే దాని లక్ష్యం నెరవేరుతుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ ఉన్నతాధికారులు, పెట్టుబడిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఏపీ పర్యాటక విధానం 2024-29లోని రాయితీలు, ప్రోత్సాహకాలను పెట్టుబడిదారులకు వివరించారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com